


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 280, పేజీలు - 08
శనివారం, మార్చి 28, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## అంగరంగ వైభవంగా
# రాములోరి కళ్యాణం

### - పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి దంపతులు





**భద్రాచలం / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** శ్రీరామనవమి సందర్భంగా తెలంగాణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాచలం లో శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. స్వామివారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సతీమణి గీత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందించారు. ఈ సందర్భంగా భద్రాచలం ఆలయానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఇక అశేష భక్తజనం జయ జయ ధ్వానాల మధ్య మిథిలా మండపంలో అభిజిత్ లగ్నంలో ఆలయ పూజారులు, వేద పండితులు సీతారాముల కళ్యాణ క్రతువును పూర్తి చేశారు. ఇక భద్రాచలం సీతారాముల కళ్యాణాన్ని కళ్లారా చూసేందుకు అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. శ్రీరామ నామస్మరణతో భద్రాచలం పుర వీధులన్నీ మార్మోగిపోయాయి. ఈ సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు పోటెత్తారు. ఈ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. భద్రాచలం ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. రాములోరి కళ్యాణాన్ని చూసేందుకు వచ్చిన భారీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రాచలం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ముత్యాల తలంబ్రాలు..

2లో..

## యుద్ధం వేళ సీఎంలతో
# ప్రధాని భేటీ

### - రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళికలపై కీలక చర్చలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో యుద్ధంతో నెలకున్న ఉద్రిక్తతలు, దేశంపై దాని ప్రభావం, పరిణామాలపై చర్చించేందుకు అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. సాయంత్రం 6.30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని వారితో మాట్లాడారు. ఈ సమావేశానికి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న పశ్చిమ్ బెంగాల్, తమిళనాడు, కేరళ సహా ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం దూరంగా ఉన్నారు. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఏ రేవంత్ రెడ్డి సహా మిగతా రాష్ట్రాల సీఎంలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళికలపై ప్రధాని

2లో..

## కొత్త పార్టీకి
# ముహూర్తం ఫిక్స్

- ఏప్రిల్ 25న పార్టీ ఆవిర్భావ సభకు ముహూర్తం ఖరారు
- సభ వేదికగా పార్టీ పేరు, జెండా ఆవిష్కరణ
- తెలంగాణ ఆడ బిడ్డగా పార్టీ పెడుతున్నానన్న కవిత
- యువత, మహిళలకు పెద్దపీట వేస్తామని స్పష్టం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరో కొత్త పార్టీతో తెరపైకి వస్తున్నారు. రాష్ట్ర ఏర్పాటు ఆశయాలైన నీళ్లు, నిధులు, నియామకాలు ఆశించిన స్థాయిలో నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రజల పక్షాన పోరాడేందుకు కొత్త ప్రాంతీయ పార్టీని ప్రకటిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఏప్రిల్ 25వ తేదీ ఉదయం 10 గంటలకు మేడ్చల్ సమీపంలోని మునీరాబాద్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, అధికారికంగా పార్టీని ప్రకటించనున్నట్లు ఆమె తెలిపారు.

### మేము ఎవరికీ బీ టీమ్ కాదు

ప్రెస్ మీట్ వేదికగా కవిత తనపై వస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణలో ఎప్పుడు కొత్త పార్టీ పెట్టినా ఇతర పార్టీలకు బీ టీమ్ అని ముద్ర వేయడం పరిపాటిగా మారిందని, తాము ఎవరికీ తొత్తులం కాదని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ స్వచ్ఛమైన తెలంగాణ ప్రాంతీయ పార్టీ అని, భవిష్యత్తులో రాష్ట్రంలో నంబర్ వన్ పార్టీగా అవతరించబోతోందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కేవలం రాజకీయాల కోసమే కాకుండా, తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని కాపాడే ఇంటి పార్టీ గా జాగృతి పనిచేస్తుందన్నారు. తాను నిజామాబాద్ గడ్డపై పుట్టిన బిడ్డనని, ఆ మట్టిలో పుట్టిన ఏ ఆలోచనైనా దేశంలో విజయవంతమైందని కవిత గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్నా తెలంగాణ ఉద్యమ ప్రధాన నినాదాలైన నీళ్లు, నిధులు, నియామకాలు పూర్తిగా సాధ్యం కాలేదని

2లో..

## రఘురామపై
# దాడికి యత్నం

### - సొంత అడ్డాలోనే రాడ్లు, మేకులతో



**అమరావతి (ప్రశ్న న్యూస్)** పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. శ్రీరామనవమి సందర్భంగా పెదపేటలోని రామాలయం సందర్శనకు వెళ్లిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును అడ్డుకునేందుకు కొంతమంది ప్రయత్నించటం ఉద్రిక్తతకు కారణమైంది. అయితే వీరిని కూటమి కార్యకర్తలు, నేతలు అడ్డుకోవటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాల మధ్య వాగ్వాదం కాస్తా ఘర్షణకు దారితీసింది. ఈ దాడిలో కొంతమందికి గాయాలయ్యాయి. గాయపడినవారిని సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. గ్రామంలో భారీగా మోహరించారు. అయితే ఘర్షణ తలెత్తడానికి ముందే ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆయన వెళ్లిన తర్వాత కూటమి కార్యకర్తలపై కొంతమంది దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ దాడిలో కూటమి కార్యకర్తలకు గాయాలు కాగా వారిని ఆస్పత్రికి తరలించారు. మరోవైపు ఈ ఘటనపై డిప్యూటీ స్పీకర్

2లో..

# అమరావతికి రాజ్యాంగ రక్షణ

### - ఏపీ రాజకీయాల్లో చారిత్రక మలుపు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రంలో అమరావతి కేవలం ఒక రాజధాని నగరం మాత్రమే కాదు, అది ఒక ఐదు కోట్ల ప్రజల ఆశలకూ, ఆవేదనలకూ ప్రతీకగా మారింది. ఐదేళ్లుగా ఎదుర్కొన్న అనిశ్చితికి తెరదించుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమరావతికి కేంద్ర రక్షణ కవచం కల్పించే దిశగా వేస్తున్న అడుగులు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

### విభజన చట్టం సవరణ - ఒక శాశ్వత పరిష్కారం

రాష్ట్ర విభజన చట్టం-2014లో కొత్త రాజధాని అనే పదం ఉందే తప్ప, స్పష్టంగా అమరావతి అనే పేరు లేదు. దీనిని ఆసరాగా చేసుకునే గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల ప్రతిపాదనను తెరపైకి తెచ్చిందని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పుడు అసెంబ్లీలో తీర్మానం చేసి, దాని ఆధారంగా కేంద్రం విభజన చట్టంలోని సెక్షన్-5ను సవరించడం ద్వారా అమరావతిని అధికారిక రాజధాని గా గెజిట్‌లో చేర్చనుంది. ఒకసారి చట్టంలో పేరు చేరితే, భవిష్యత్తులో ఏ ప్రభుత్వం వచ్చినా, ఏ ముఖ్యమంత్రి అనుకున్నా దానిని మార్చడం రాజ్యాంగబద్ధంగా దాదాపు అసాధ్యం అవుతుంది. ఇది అమరావతికి ఒక పటిష్టమైన చట్టబద్ధమైన గ్యారంటీ ని ఇస్తుంది.

2లో..

# ఆటల బరిలోకి తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

### - హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా స్పోర్ట్స్ మీట్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాజకీయ నాయకులు అంటే నిత్యం ప్రజల్లో తిరుగుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తారు. ప్రతిపక్షాలపై అధికార పక్షం అధికార పక్షంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పించుకుంటారు. ప్రారంభోత్సవాలు, సంక్షేమ పథకాల అమలు, శంకుస్థాపనలు, రాజకీయ సభలు, సమావేశాలతో బిజీ బిజీగా గడుపుతూ ఉంటారు. తమ ఇంటికి వచ్చిన నియోజకవర్గ ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుని తీర్చుతూ ఉంటారు. ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు ఫుల్ బిజీగా ఉంటారు. అయితే అలా బిజీ బిజీ లైఫ్ గడిపే ప్రజా ప్రతనిధులకు ఆటల పోటీలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 28, 29వ తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ

2లో..

## మేము క్రీడలు ఆడి ఒలింపిక్స్‌కి
# వెళ్లేది ఏమీ లేదు

### - స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనడం లేదని కేటీఆర్ స్పష్టం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నిత్యం రాజకీయాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే తెలంగాణ ప్రజాప్రతినిధులకు బిగ్ రిలీఫ్ ప్రకటించారు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్. ప్రజాప్రతినిధులకు ఆటలపోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం 'లెజిస్లేటర్

2లో..

# టీవీ రేటింగ్స్‌పై కేంద్రం కొత్త పాలసీ

### - పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యం




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో టెలివిజన్ ఆడియన్స్ మెజర్‌మెంట్ వ్యవస్థలో పారదర్శకత, స్వాతంత్ర్యం, జవాబుదారీతనాన్ని పెంపొందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'టీవీ రేటింగ్స్ పాలసీ 2026'ను శుక్రవారం ఆవిష్కరించింది. 2014 నాటి మార్గదర్శకాల స్థానంలో ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ రంగంలోకి కొత్త సంస్థలు ప్రవేశించడాన్ని సులభతరం చేస్తూ, సరసమైన పద్ధతులు, కచ్చితమైన డేటా సేకరణ, బలమైన పర్యవేక్షణ ఉండేలా ఈ పాలసీని రూపొందించారు. సరికొత్త నిబంధనల ప్రకారం, టీవీ రేటింగ్ ఏజెన్సీగా కార్యకలాపాలు ప్రారంభించాలనుకునే కంపెనీలకు ప్రవేశ నిబంధనలను ప్రభుత్వం గణనీయంగా సడలించింది. గతంలో ఉన్న రూ.20 కోట్ల

2లో..

## హర్మూజ్‌లో
# తీవ్ర ఉద్రిక్తత

### - చమురు ట్యాంకర్‌ను ధ్వంసం చేసిన ఇరాన్




హర్మూజ్ (ప్రశ్న న్యూస్) ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంతో అట్టుడుకుతున్న పర్షియన్ గల్ఫ్‌లో మరోసారి ఉద్రిక్తత తారస్థాయికి చేరింది. హర్మూజ్ జలసంధిలో తమ నిబంధనలు ఉల్లంఘించి ప్రవేశించిన ఓ ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్జీసీ)

2లో..

## ప్రపంచ టెలికాం వ్యవస్థలకు
# పెనుముప్పు

### - చైనా హ్యాకర్ల కొత్త ఎత్తుగడ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రపంచవ్యాప్తంగా టెలికాం మౌలిక సదుపాయాలే లక్ష్యంగా చైనాకు చెందిన ఓ హ్యాకింగ్ గ్రూప్ అత్యంత ప్రమాదకరమైన సైబర్ దాడులకు పాల్పడుతోందని ఓ నివేదిక సంచలన విషయాలు వెల్లడించింది. ఈ హ్యాకర్లు దీర్ఘకాలిక సైబర్ గూఢచర్యం కోసం టెలికాం నెట్‌వర్క్‌లలోకి రహస్యంగా మాల్‌వేర్‌ను చొప్పిస్తున్నారని సైబర్ సెక్యూరిటీ సంస్థ రాపిడ్7 తన నివేదికలో హెచ్చరించింది. ఈ హ్యాకర్లు "డిజిటల్ స్లీపర్ సెల్స్" తరహాలో

2లో..

# అంగరంగ వైభవంగా రాములోరి కళ్యాణం

లడ్డు ప్రసాదాలను పంపిణీ చేయడం కోసం స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశారు. భక్తులు భారీగా తరలివచ్చిన నేపథ్యంలో వారికి ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ భారీ ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేసింది. భద్రాద్రి జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది భద్రత ఏర్పాట్లు చేశారు.

మరోవైపు భద్రాచలం శ్రీరామనవమి కళ్యాణోత్సవంలో ప్రభుత్వం తరఫున సమర్పించే పట్టు వస్త్రాలను సుమారు 100 ఏళ్లుగా ఒకే కుటుంబం అందిస్తోంది. సికింద్రాబాద్‌కు చెందిన ఎస్ ఎస్ జయరాజు ఫ్యామిలీ ఈ పట్టు వస్త్రాలను సిద్ధం చేస్తోంది. ఆ కుటుంబంలోని 3 తరాలు ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నాయి. భద్రాచలం ఆలయం ఆవరణలోనే ప్రత్యేకంగా ఒక మగ్గాన్ని ఏర్పాటు చేసి పోచంపల్లి స్టైల్‌లో సీతమ్మకు చీరలు, రామలక్ష్మణులకు పంచెలను నేశారు. రూ.2 లక్షల వ్యయంతో తయారు చేసిన ఈ పట్టు వస్త్రాలను నేడు సీఎం రేవంత్ రెడ్డి దంపతులు స్వామివారికి సమర్పించారు.

# యుద్ధం వేళ సీఎంలతో ప్రధాని భేటీ

చర్చలు జరిపారు. టీమిండియా స్ఫూర్తితో రాష్ట్రాలను సమన్వయం చేసుకునేలా జరిగిన ఈ భేటీకి హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా హాజరయ్యారు. పార్లమెంట్‌లో పశ్చిమాసియా యుద్ధ పరిణామాలు, చమురు, గ్యాస్ సంక్షోభం నివారణకు భారత్ తీసుకుంటున్న చర్యల గురించి ప్రధాని మోదీ ప్రసంగించిన సంగతి తెలిసిందే. పెరుగుతున్న ప్రపంచ ఉద్రిక్తతల దృష్ట్యా, ఇంధన సరఫరా, ద్రవ్యోల్బణం, లాజిస్టిక్స్ అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ పరిస్థితి వల్ల తలెత్తే ఏవైనా పరిణామాలను ఎదుర్కోవడానికి సంసిద్ధతను కూడా ఈ సమావేశంలో సమీక్షించారు.పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరత కారణంగా భారత్‌కు ఇంధన సంక్షోభం ముప్పు పొంచి ఉంది. క్రూడాయిల్, గ్యాస్ సరఫరాల్లో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. అంతర్జాతీయంగా సరఫరా గొలుసు దెబ్బతినడంతో రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలని, పరిణామాలను ఎదుర్కొండానికి సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రులకు మోదీ సూచించినట్టు తెలుస్తోంది. అయితే, సంక్షోభాన్ని ఎదుర్కొడానికి తీసుకోబోయే చర్యల గురించి ముఖ్యమంత్రులు సైతం ప్రధానికి తమ అభిప్రాయాలను తెలియజేసినట్టు సమాచారం. అలాగే, దేశంలో మరోసారి లాక్‌డౌన్ విధిస్తారని జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్రం ఖండించిన సంగతి తెలిసిందే. ఇక, పశ్చిమాసియాలో యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. చర్చలు జరుపుతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నా ఇరాన్‌పై ఇజ్రాయెల్–అమెరికా సైన్యం దాడులు కొనసాగుతున్నాయి. అటు, గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై క్షిపణులు, డ్రోన్లతో 83 వ విడత దాడులు ప్రారంభించినట్టు ఇరాన్ ప్రకటించింది. యూఏఈ శుక్రవారం తాము 9 క్షిపణులు, 6 డ్రోన్లను అడ్డుకున్నామని ప్రకటించింది.

# అమరావతికి రాజ్యాంగ రక్షణ

### పెట్టుబడులకు భరోసా - ఆర్థిక పరిపుష్టి

రాజధాని విషయంలో గతంలో ఏర్పడిన గందరగోళం వల్ల అంతర్జాతీయ సంస్థలు, భారీ పరిశ్రమలు ఏపీకి రావడానికి వెనుకాడాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ముద్ర పడటంతో, అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలుగుతుంది. కేంద్రం నుంచి వచ్చే నిధులు, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల రుణాల మంజూరు ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది. చట్టబద్ధమైన గుర్తింపు వల్ల అమరావతి కేవలం ఒక పరిపాలనా కేంద్రంగానే కాకుండా, ఆర్థిక రాజధానిగా ఎదిగేందుకు పునాది పడుతోంది.

### రైతుల్లో పెరిగిన విశ్వాసం - రెండో విడత భూసమీకరణ

అమరావతి కోసం భూములిచ్చిన 29 వేల మంది రైతులకు ఈ నిర్ణయం ఒక పెద్ద విజయం. గత ఐదేళ్లుగా వారు చేసిన పోరాటానికి ఇప్పుడు తగిన గుర్తింపు లభించినట్లయింది. రాజధాని మార్పు సాధ్యం కాదన్న స్పష్టత రావడంతో, భూముల విలువలు పెరగడమే కాకుండా, రాజధాని విస్తరణకు అవసరమైన రెండో విడత భూసమీకరణకు కూడా రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఇది రాజధాని నిర్మాణ వేగాన్ని మరింత పెంచుతుంది.

### చంద్రబాబు వ్యూహాత్మక విజయం

ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పి, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఆమోదం పొందడంలో చంద్రబాబు నాయుడు తన అనుభవాన్ని ఉపయోగించారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, ఈ అవకాశాన్ని రాజధాని అస్తిత్వాన్ని కాపాడటానికి వాడుకోవడం ఒక మాస్టర్ స్ట్రోక్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. అమరావతికి లభించబోయే ఈ 'కేంద్ర రక్షణ' కేవలం చట్టపరమైన మార్పు మాత్రమే కాదు, అది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థిరత్వానికి, అభివృద్ధికి ఒక బలమైన హామీ.

### వైసీపీ విధానమేంటి?

అసెంబ్లీలో ఈ తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు వైసీపీ ఏ స్టాండ్ తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. మద్దతు ఇస్తే తమ పాత వాదన తప్పు అని ఒప్పుకున్నట్లవుతుంది, వ్యతిరేకిస్తే అమరావతి ద్రోహులు గా ముద్ర పడే ప్రమాదం ఉంది. అయితే ఎప్పట్లానే సమావేశానికి గైర్హాజర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. తాము అమరావతికి వ్యతిరేకం కాదని ప్రకటనలు చేస్తున్నా పరస్పర విరుద్ధమైన ప్రకటనలు తరచూ చేస్తూండటంతో ప్రజల్లో నమ్మకం లేకుండా పోయింది.

# ఆటల బరిలోకి

# తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం శాసనసభలో ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా తొలి విడత లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్--2026 నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కమిటీ ఛైర్మన్‌గా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కో ఛైర్మన్‌గా క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని నియమించారు. అదే సమయంలో రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇలాంటి ఆటల పోటీలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

ఈ కమిటీకి కన్వీనర్‌గా ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సహా మరో 13 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. గురువారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశమైన ఈ కమిటీ ప్రజా ప్రతినిధులకు నిర్వహించనున్న పోటీల నిర్వహణపై సమీక్ష చేపట్టింది. నేడు మధ్యాహ్నం 3:30 గంటలకు ఎల్బీ స్టేడియంలో క్రీడలు ప్రారంభం కానున్నట్లు కమిటీ స్పష్టం చేసింది.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడంతోపాటు రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని నింపడం కోసమే ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ కమిటీ ఛైర్మన్, మంత్రి జూపల్లి కృష్ణారావు కో ఛైర్మన్ మంత్రి వాకిటి శ్రీహరి తేల్చి చెప్పారు. అంతకుముందు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసిన మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి స్పోర్ట్స్ కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రులు ఈ నెల 28, 29వ తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్--2026 ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# రఘురామపై దాడికి యత్నం

రఘురామకృష్ణరాజు స్పందించారు. కొద్దిలో తాను తప్పించుకున్నానని అన్నారు. దాడికి కారణమైనవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు."నేను కొద్దిలో తప్పించుకున్నా. త్రుటిలో మిస్ అయ్యా. నేను బయల్దేరిన మరుక్షణం మేకులు, చాకులు, కత్తులు, రాళ్లతో దాడి చేశారు. ముందుగా ప్లాన్ చేసుకున్న ప్రకారం మాపై దాడి చేశారు. శ్రీరామనవమి రోజు కూడా వందేళ్ల చరిత్ర ఉన్న రామాలయంలో పూజలు చేయడానికి వీల్లేదనే దారుణమైన పరిస్థితి వచ్చింది. ఇలాంటి పరిస్థితిని ఆదిలోనే అరికట్టాల్సిన అవసరం ఉంది.

దాడి చేసిన వారి విజువల్స్ ఉన్నాయి. పోలీసులు పరిశీలిస్తున్నారు. దాడి చేసిన వారిని గుర్తించాం. హత్యాప్రయత్నం చేసిన వారిపై కేసులు పెట్టి, కఠినంగా శిక్షించాలని కోరుతున్నాం" అని రఘురామకృష్ణరాజు కోరారు. మరోవైపు పెదపేటలో తమ నివాసాల మధ్య రఘురామకృష్ణరాజు బలవంతంగా రామాలయం నిర్మించారని మరో వర్గం చెప్తోంది. ఈ క్రమంలోనే పూజలు చేసేందుకు వెళ్లిన రఘురామకృష్ణరాజును అడ్డుకునేందుకు కొంతమంది యత్నించారు. అయితే పోలీస్ బందోబస్తు మధ్య ఆయన స్వామి దర్శనం చేసుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అయితే ఆయన అక్కడి నుంచి బయల్దేరి వెళ్లిన కాసేపటికే ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

# కొత్త పార్టీకి ముహూర్తం ఫిక్స్

ఆమె విమర్శించారు. ఇబ్బందులు పడుతున్న ప్రజల గొంతుకగా మారేందుకే ఈ కొత్త పార్టీ ఆవిర్భవిస్తోందని, తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.

### బీఆర్ఎస్ క్యాడర్‌పై గురి

బీఆర్ఎస్ పార్టీలోని అట్టడుగు స్థాయి కార్యకర్తలు మొత్తం తన వెంటే ఉన్నారని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి తనతో కలిసి నడిచిన శక్తులన్నీ కొత్త పార్టీకి అండగా నిలుస్తాయని చెప్పారు. పార్టీలో యువతకు, మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, వారి నాయకత్వంలోనే రాష్ట్ర రాజకీయాలను మార్చే దిశగా అడుగులు వేస్తామని ప్రకటించారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ విధివిధానాలు ఉంటాయని వెల్లడించారు. తెలంగాణ సమాజం ప్రస్తుతం మార్పును కోరుకుంటోందని, ఆ మార్పును తమ పార్టీ ద్వారా తీసుకువస్తామని కవిత ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటామని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. ఏప్రిల్ 25న జరగబోయే బహిరంగ సభ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని, పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు తెలపాలని ఆమె పిలుపునిచ్చారు.

### సర్వోదయ తెలంగాణ నినాదం

సర్వోదయ అంటే అందరి అభ్యుదయం. గాంధేయవాద స్ఫూర్తితో సమాజంలోని అన్ని వర్గాలకు సమాన ఫలాలు అందడమే దీని లక్ష్యం. కొత్త పార్టీలో యువతకు, మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, వారి నాయకత్వంలోనే రాష్ట్ర రాజకీయాలను మారుస్తామని చెప్పారు.

# మేము క్రీడలు ఆడి ఒలింపిక్స్‌కి వెళ్లేది ఏమీ లేదు

స్పోర్ట్స్ మీట్--2026' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా ఈ క్రీడా పోటీలు జరగనున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్-2026కు బీఆర్ఎస్ సభ్యులు హాజరుకావడం లేదు అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు.

### ఈ క్రీడా పోటీలలో పాల్గొనం

తెలంగాణ ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్వహిస్తున్న క్రీడా పోటీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని రంగాల ప్రజలు అనేక సమస్యలు, సంక్షోభాలు ఎదుర్కొంటున్న సమయంలో ఇటువంటి క్రీడా కార్యక్రమాలలో పాల్గొని సమయం వృథా చేయడం తగదని స్పష్టం చేశారు. 'మేము ఎమ్మెల్యేలుగా ఈ క్రీడా పోటీలలో పాల్గొనబోమని కేటీఆర్ వెల్లడించారు. సభను కనీసం ఇంకో 10 రోజులు కొనసాగించి ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని, అనేక కీలక అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను పక్కనబెట్టి, అర్థాంతరంగా అసెంబ్లీని వాయిదా వేసి క్రీడలు నిర్వహించడం ప్రజలు సమర్థించరని, ఇది మంచి పరిణామం కాదని ఆయన అన్నారు. ప్రభుత్వం కూడా ఈ క్రీడా పోటీలపై పునరాలోచన చేయాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు.

### మేము ఆడి ఒలింపిక్స్‌కి వెళ్లేది ఏమీ లేదు

'మేము క్రీడలు ఆడి ఒలింపిక్స్‌కి వెళ్లేది ఏమీ లేదు. క్రీడలను ప్రోత్సహించాలంటే పిల్లలకు అవకాశాలు కల్పించి, వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆటలు ఆడించడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు'అని కేటీఆర్ పేర్కొన్నారు.అయితే ఎవరైనా క్రీడల్లో పాల్గొనాలనుకుంటే ముందుగా ప్రజా సమస్యలపై చర్చలు పూర్తిచేసి, శాసనసభను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత రెండు రోజులపాటు క్రీడలు నిర్వహించుకోవచ్చని సూచించారు. అసెంబ్లీ వాయిదా వేసి క్రీడలు నిర్వహించడం హాస్యాస్పదమని ఆయన విమర్శించారు. ఈ పరిణామాలు చూస్తే ప్రభుత్వానికి ప్రజా సమస్యల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

# టీవీ రేటింగ్స్‌పై కేంద్రం కొత్త పాలసీ

నికర విలువ (నెట్‌వర్త్) ఆవశ్యకతను రూ.5 కోట్లకు తగ్గించింది. ఈ రంగంలో మరింత పోటీని ప్రోత్సహించి, కొన్ని సంస్థల గుత్తాధిపత్యాన్ని నివారించడమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం.రేటింగ్ ఏజెన్సీల నిష్పాక్షికతను, స్వతంత్రతను కాపాడేందుకు పాలసీలో కఠినమైన నిబంధనలు చేర్చారు. ఏజెన్సీల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో కనీసం సగం మంది బ్రాడ్‌కాస్టర్లు, ప్రకటనకర్తలు లేదా అడ్వర్టైజింగ్ ఏజెన్సీలతో ఎలాంటి సంబంధం లేని స్వతంత్రులుగా ఉండాలని తప్పనిసరి చేశారు. అలాగే, తమ నిష్పాక్షికతకు భంగం కలిగించేలా ఎలాంటి కన్సల్టెన్సీ పనులు చేపట్టకుండా ఏజెన్సీలపై నిషేధం విధించారు. డేటా కచ్చితత్వాన్ని మెరుగుపరిచేందుకు, శ్యాంపిల్ సైజును భారీగా పెంచాలని ఆదేశించింది. ప్రస్తుతం ఉన్న ఏజెన్సీలు ఆరు నెలల్లోగా, కొత్తగా వచ్చేవి 18 నెలల్లోగా తమ మీటర్డ్ ఇళ్ల సంఖ్యను 80,000కు పెంచాలి. భవిష్యత్తులో ఈ సంఖ్యను 1,20,000 ఇళ్లకు విస్తరించనున్నారు. అంతేకాకుండా, కేబుల్, డీటీహెచ్, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, కనెక్టెడ్ టీవీలతో సహా అన్ని మాధ్యమాల్లో వీక్షకుల డేటాను సేకరించేలా సాంకేతికతతో సంబంధం లేకుండా ఈ వ్యవస్థను రూపొందించారు.పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, రేటింగ్ ఏజెన్సీలు తాము అనుసరించే పద్ధతులను, అనామక డేటాను తమ వెబ్‌సైట్లలో ప్రచురించాలని ఆదేశించారు. అదే సమయంలో, వీక్షకుల వ్యక్తిగత సమాచార భద్రత కోసం 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్, 2023'కు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. జవాబుదారీతనాన్ని పెంచేందుకు ద్వంద్వ ఆడిట్ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం త్రైమాసిక అంతర్గత ఆడిట్లు, వార్షిక బాహ్య ఆడిట్లు నిర్వహించాల్సి ఉంటుంది. వీటికి అదనంగా, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించేందుకు మంత్రిత్వ శాఖ ఒక 'ఆడిట్ అండ్ ఓవర్‌సైట్ టీమ్'ను కూడా ఏర్పాటు చేయనుంది. ఈ మార్పులతో బ్రాడ్‌కాస్టింగ్ రంగంలో విశ్వసనీయమైన, పారదర్శకమైన వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# హార్మూజ్‌లో తీవ్ర ఉద్రిక్తత

క్షిపణులతో దాడి చేసి ధ్వంసం చేసింది. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దాడికి గురైన ట్యాంకర్ పాకిస్థాన్ జెండాతో ఉన్నట్లు పలు కథనాలు సూచిస్తున్నాయి. ఇరాన్ హెచ్చరికలను పెడచెవిన పెట్టి జలసంధిని దాటేందుకు ప్రయత్నించడంతోనే ఈ దాడి చేసినట్లు ఇరాన్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, పాకిస్థాన్ జెండా చాటున చమురును అక్రమంగా అమెరికాకు తరలిస్తున్నారని, దానికి ప్రతీకారంగానే ఈ దాడి జరిగిందనే కథనాలు వినిపిస్తున్నాయి. ట్యాంకర్‌కు మంటలు అంటుకుని, పూర్తిగా ధ్వంసమైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనలో సిబ్బంది ప్రాణనష్టంపై ఇంకా స్పష్టత రాలేదు.ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినప్పటి నుంచి హార్మూజ్ జలసంధిని ఇరాన్ తన నియంత్రణలోకి తీసుకుంది. తమ అనుమతి లేకుండా ఏ నౌక ప్రవేశించరాదని ఆంక్షలు విధించింది. దీంతో ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం స్తంభించిపోగా, 85కి పైగా ట్యాంకర్లు గల్ఫ్‌లోనే చిక్కుకుపోయాయి. మార్చి 11న కూడా థాయ్‌లాండ్‌కు చెందిన నౌకపై దాడి జరిగింది. ఈ సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లను దాటింది. తాజా ఘటనతో ఈ ప్రాంతంలో యుద్ధ మేఘాలు మరింత దట్టమయ్యాయి. సంక్షోభం ముదరకుండా దౌత్యపరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# ప్రపంచ టెలికాం

# వ్యవస్థలకు పెనుముప్పు

పనిచేసే అత్యాధునిక టూల్స్‌ను వాడుతున్నారని నివేదిక తెలిపింది. కెర్నల్-స్థాయి ఇంప్లాంట్లు, పాసివ్ బ్యాక్‌డోర్స్ వంటివి నెట్‌వర్క్‌లలో చాలాకాలం పాటు గుర్తించబడకుండా దాగి ఉండేందుకు వీలు కల్పిస్తాయి. తద్వారా, వ్యవస్థలను నిశ్శబ్దంగా పర్యవేక్షిస్తూ, తమ ఉనికి బయటపడకుండా హ్యాకర్లు యాక్సెస్‌ను కొనసాగిస్తారు. ప్రభుత్వ, కీలక కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లపై నిఘా పెట్టడమే వీరి లక్ష్యమని నిపుణులు భావిస్తున్నారు.ఈ దాడుల్లో "బీపీఎఫ్‌డోర్" అనే లినక్స్ ఆధారిత బ్యాక్‌డోర్‌ను ప్రధానంగా ఉపయోగిస్తున్నట్టు రాపిడ్7 గుర్తించింది. ఇది సిస్టమ్ కెర్నల్‌లోనే దాగి ఉంటూ, నెట్‌వర్క్ ట్రాఫిక్‌ను గమనిస్తుంది. డేటా ప్యాకెట్లలో ఒక ప్రత్యేకమైన రహస్య సిగ్నల్ వచ్చినప్పుడు మాత్రమే ఇది యాక్టివేట్ అవుతుంది. సిస్కో, ఫోర్టినెస్, వీఎమ్‌వేర్, ఇవాంటీ వంటి ప్రముఖ కంపెనీల సిస్టమ్స్‌లోని లోపాలను హ్యాకర్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. కేవలం ఒక్కో సిస్టమ్‌ను హ్యాక్ చేయడమే కాకుండా, టెలికాం నెట్‌వర్క్‌లకు గుండెకాయలాంటి కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పట్టు సాధించడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని నివేదిక స్పష్టం చేసింది. కమ్యూనికేషన్ వ్యవస్థల వెన్నెముకనే లక్ష్యంగా చేసుకోవడం వల్ల ఈ దాడులు అత్యంత ప్రమాదకరమని సైబర్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో డేటా ప్రవాహాన్ని పర్యవేక్షించడం, సేవలకు అంతరాయం కలిగించడం వంటివి చేసే అవకాశం హ్యాకర్లకు లభిస్తుంది.

# శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం యాదగిరిగుట్ట



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మ వారికి ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.అమ్మవారిని ప్రధాన ఆలయం నందు అద్దాల మండపంలో అధిష్ఠింపజేసి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు.

# గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో డొమెస్టిక్ సిలిండర్ల అక్రమ వినియోగం

**దాడులు మరిచే కార్యాలయాలకే పరిమితమైన పౌరసరఫరా శాఖ అధికారులు**

**- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**



గజ్వేల్(ప్రశ్న న్యూస్)సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో వాణిజ్య అవసరాల కోసం గృహ వినియోగ (డొమెస్టిక్) గ్యాస్ సిలిండర్లను యథేచ్ఛగా వినియోగిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వాడాల్సి ఉండగా, అధిక లాభాల కోసం చాలా మంది యజమానులు డొమెస్టిక్ సిలిండర్లను వాడుతున్నారు. నిత్యావసరంగా ఉండాల్సిన గృహ వినియోగ సిలిండర్లను హోటళ్లలో వాడటం వల్ల సామాన్య ప్రజలకు గ్యాస్ కొరత ఏర్పడుతోంది. బుక్ చేసుకున్న సకాలంలో సిలిండర్లు అందక గృహిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో ఇన్ని అక్రమాలు జరుగుతున్నా, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు అసలు దాడులు చేయడం లేదని కార్యాలయానికి పరిమితమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు అనుసంఘంలోనే ఈ అక్రమాలు జరుగుతున్న అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి అధికారులు వెంటనే స్పందించి మున్సిపల్ పరిధిలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సామాన్యులకు గ్యాస్ కొరత లేకుండా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో

# ఇరాన్‌లో 1,900 మంది మృతి

**- వెల్లడించిన ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ**



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) అమెరికా–ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్‌లో 1,900 మందికి పైగా మరణించారని ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత నెల ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పటివరకు అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో సుమారు 20,000 మంది గాయపడ్డారని తెలుస్తోంది. ఇరాన్ చేసిన ప్రతీకార దాడుల్లో ఇజ్రాయెల్‌లో 18 మంది, గల్ఫ్‌లో 20 మంది మృతి చెందారు. 13 మంది అమెరికన్ సైనికులు కూడా మృతి చెందారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 1,100 మందికి పైగా మరణించారని అక్కడి అధికారులు తెలిపారు. ఇరాక్‌లో మరో 80 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దీర్ఘ, మధ్యశ్రేణి క్షిపణులను ప్రయోగించినట్లు ఐఆర్జీసీ తెలిపింది. ఈ దాడుల్లో బహ్రెయిన్‌లోని అమెరికా పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థ నిర్వహణ కేంద్రం ధ్వంసమైనట్లు తెలిపింది.

## రజత కాంతుల్లో మెరిసిపోతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవ శోభ





**బద్వేలు** కడప జిల్లా ఒంటిమిట్టలోని పవిత్రక్షేత్రమైన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల హృదయాలను పరవశింపజేసేలా టిటిడి అత్యంత వైభవంగా విద్యుత్ అలంకరణలను చేపట్టింది. వెన్నెలను తలపించే వెలుగుల మధ్య ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక ఆనందాన్ని ప్రసరింపజేస్తూ భక్తులకు దివ్యానుభూతిని అందిస్తున్నాయి.ఒంటిమిట్ట ఆలయం లోపల మరియు వెలుపల ప్రాంతాలు, పరిసర ప్రాంతాలు, టిటిడి భవనం, వాహన మండపం, ఆలయం ముందు గార్డెన్, ప్రధాన కూడళ్లు, అలాగే ఒంటిమిట్ట నుండి మాధవవరం వరకు మార్గమంతా విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నాలుగు మాడ వీధులు, పుష్కరిణి, పార్కింగ్ ప్రాంతం, ఒంటిమిట్ట పరిసర ప్రాంతాలు, కల్యాణ వేదిక తదితర ప్రాంతాలు రాత్రివేళల్లో రజత కాంతులతో మెరిసిపోతూ బ్రహ్మోత్సవాలకు అపూర్వమైన శోభను చేకూర్చుతున్నాయి.బ్రహ్మోత్సవాల సందర్భంగా 30కి పైగా దేవతామూర్తుల పెద్ద బొమ్మలు, 70కు పైగా ప్రత్యేక డిజైన్ బోర్డులు, అలాగే అనేక అద్భుత ఇల్యూమినేషన్ బోర్డులను ఏర్పాటు చేశారు. దేవాతామూర్తుల పెద్ద బొమ్మలలో శ్రీరామ పట్టాభిషేకం, శ్రీరామ కల్యాణం, అయోధ్య రాముడు, రామబాణం, ఏనుగు మీద శ్రీవారు, గరుత్మంతుడిపై శ్రీవారు, శ్రీ పద్మనాభ స్వామి, అమ్మవారి త్రీడీ రూపం, శ్రీరాముడు ? శబరి, దశావతారాలు, అష్టలక్ష్ములు వంటి దివ్యరూపాలు విద్యుత్ కాంతుల్లో ప్రకాశిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సౌందర్యాన్ని పంచనున్నాయి.అదేవిధంగా 20 వేల సీరియల్ లైట్స్, 10 వేల ఫ్లడ్ లైట్లు, 500 రంగు రంగుల లైట్లు, 40 జనరేటర్లు, వివిధ రకాల తోరణాలతో ఒంటిమిట్ట అంతా ప్రకాశవంతంగా మారి బ్రహ్మోత్సవాల వైభవాన్ని మరింత పెంచనున్నాయి.

## కనుల వైభోగమే
# శ్రీ సీతారాముల కళ్యాణం

**- అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం వేడుకలు**




**కౌతాళం** కనుల వైభవంగా అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ కళ్యాణం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేళా తాళాలు పండితుల వేద మంత్రాలు ఒక్కటైనా శ్రీ సీతారాముల కళ్యాణం చూడముచ్చట కనులవిందుగా జరిగింది. శ్రీరామనవమి సందర్భంగా రాజనగర్ క్యాంపులో అంగరంగ వైభవంగా శ్రీరాముని ఆలయంలో పూల అలంకరణ విద్యుత్ దీపాలతో కనువిందు చేశాయి. శ్రీ సీతారాముల కళ్యాణం చూడటానికి చుట్టుపక్కల గ్రామ ప్రజలు తరలివచ్చారు. కళ్యాణ వేదికలో బాపిరాజు వారి సతీమణి జాహ్నవి దంపతులుగా కూర్చున్నారు. వారి ఆధ్వర్యంలో వేద పండితులు చేతులు మీదుగా శ్రీ సీతారాముని కళ్యాణం నిర్వహించారు. నైవేద్య టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించి ముక్కులు తీర్చుకున్నారు. పలువురు రాజకీయ నాయకులు శ్రీరాముని ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం తిలకించి మొక్కలు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు భక్తులు కు అన్నదాన వసతి కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు నాయకులకు పలా ప్రసాదములు అందించారు

## ఆధ్యాత్మిక వాతావరణంలో
# సీతారాముల కళ్యాణం

**- కుటుంబంతో హాజరైన శ్రీనివాస్ బాబు.**

**జయశంకర్ భూపాలపల్లి.**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలం, ధన్వాడ గ్రామంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో,శు క్రవారం ఘనంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణ మండపం వద్ద స్వామి వారి దివ్య కళ్యాణాన్ని కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యక్షంగా దర్శించుకున్నారు. కళ్యాణ వేడుకల సమయంలో హారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఆశీర్వాదాలు పొందారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగే ఈ పవిత్ర వేడుకలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, ఇలాంటి దైవ కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. అనంతరం గ్రామ ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడిన శ్రీనివాస్ బాబు ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అభివృద్ధి, ప్రజల సంక్షేమం తన ప్రధాన లక్ష్యమని ఎప్పటికప్పుడు ప్రజలతో కలిసి ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## బస్సు దగ్ధం కేసులో యజమాని అరెస్టు

**మార్కాపురం జిల్లా...**మార్కాపురం లో జరిగిన బస్సు ప్రమాద ఘటనకు సంబంధించిన హరికృష్ణ ట్రావెల్స్ యజమాని హరికృష్ణ రెడ్డి ని నెల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ లో హరికృష్ణ రెడ్డిని విచారిస్తున్నారు. పరారీలో ఉన్న హరికృష్ణ రెడ్డిని సెల్ ఫోన్ సిగ్నల్ ద్వారా గుర్తించి అరెస్ట్ చేసారు.

## యానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి
# గొల్లపల్లి అశోక్‌కు జన నీరాజనం

**యానం..** యానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గొల్లపల్లి అశోక్ కు జనం నీరాజనం పలుకుతున్నారు. రెండోసారి ఎంఎల్ఎ గా గెలిపించాలని కోరుతూ గొల్లపల్లి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఏ ప్రాంతంలో ప్రచారం నిర్వహించినా ప్రజలు అడుగడుగునా మద్దతు ప్రకటిస్తూ ఆశీర్వాదం ఇస్తున్నారు.యానం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్థానీ దినేష్ తో కలిసి గొల్లపల్లి యానంలోని అనేక ప్రాంతాలలో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. యానాంలోని దరియాలతిప్ప, సావిత్రి నగర్, స్థానిక బీమ్ నగర్, యూకేవీ నగర్ లలో ఎన్నికల ప్రచారం మద్దతుదారులతో ఉత్సాహంగా సాగుతుంది. అణువణువునా గొల్లపల్లి అశోక్ కి కార్యకర్తలు, అభిమానులు, మహిళలు హారతులు ఇచ్చి పూల వర్షంతో స్వాగతం పలికారు...ఈ సందర్భంగా గొల్లపల్లి అశోక్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు చారిత్రాత్మక అవసరం అని, ఇన్నాళ్లు అభివృద్ధికి నోచుకోకుండా పేదరికంతో నిండిన యానాన్ని రక్షించుకునేందుకు తనను గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ గెలుపు ద్వారా పేద ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి సొంత గృహాలు ఏర్పాటు చేస్తానని, మెరుగైన వైద్యం యానంలోనే జరిగే విధంగా హాస్పిటల్స్ లో ప్రత్యేక వసతులు కల్పిస్తామని, 30 సంవత్సరాల బానిసత్వం నుండి విముక్తి పొంది ప్రజలు స్వేచ్ఛగా ఉండేందుకు తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్ల ను అభ్యర్థించారు.

## కనుల పండుగగా
# ప్రసన్నాంజనేయ స్వామి పునః ప్రతిష్ట

**సత్తుపల్లి** ఖమ్మం జిల్లా సత్తుపల్లి హనుమాన్ నగర్‌లో పునర్నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రసన్నాంజనేయ స్వామి పునః ప్రతిష్ట వైభవంగా జరిగింది. చైత్రమాస శుద్ధ సప్తమి సందర్భంగా పండితులు శాస్త్రోక్తంగా యంత్ర స్థాపన చేసి స్వామిని ప్రతిష్టించారు.ఈ కార్యక్రమాల్లో విజయ గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తదితర విగ్రహాల ప్రతిష్టలు కూడా భక్తుల జైశ్రీరామ్, జై హనుమాన్ నినాదాల మధ్య ఘనంగా నిర్వహించారు. యాగశాలలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎండోమెంట్ నిధులు, భక్తుల విరాళాలతో ఆలయాన్ని అందంగా నిర్మించి, సుమారు 8 వేల మంది భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేసి సౌకర్యాలు కల్పించారు.

## ధర్మారం మండలంలో ఘనంగా
# శ్రీరామనవమి వేడుకలు..

**- ధర్మారంలో పాల్గొన్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ధర్మారం,** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ధర్మారం, ఖిలావనపర్తి, కమ్మర్ ఖాన్ పేట, బుచ్చయ్యపల్లి గ్రామాలలోని శ్రీ రామాలయాలలో ఈ వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ధర్మారంలో ఆలయ నిర్వాహకులు, ధర్మకర్తలు పూస్కురు పద్మజ జితేందర్ రావు, ఖిలావనపర్తి గ్రామంలో ఆలయ కమిటీ చైర్మన్ మెట్టుపల్లి అశోక్ రావు ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలో వేద పండితులు సీతారామ కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ధర్మారంలో నిర్వహించిన వేడుకలకు రాష్ట్రమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్‌ను ఆలయ ధర్మకర్తలు పద్మజ జితేందర్ రావు సన్మానించారు. ఖిలా వనపర్తి గ్రామంలో జరిగిన వేడుకలకు నంది మేడారం ప్యాక్స్ మాజీ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి హాజరయ్యారు.

## గంగాధరలో వైభవంగా
# సీతారాముల కల్యాణం



**గంగాధర,** గంగాధర మండలంలోని ర్యాలపల్లి, బూరుగుపల్లి, కోట్లనరసింహులపల్లి, లక్ష్మీదేవిపల్లి, గంగాధర, మధురానగర్, మల్లాపూర్, కురిక్యాల, ఉప్పరమల్యాల, కాసారం, గర్శకుర్తి, గట్టుభూత్కూర్ గ్రామాల్లో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పురోహితులు సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ తంతులో మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం పోసి మొక్కలు చెల్లించుకున్నారు.అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పరమల్యాల, కురిక్యాల, మధురానగర్ లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఉప్పరమల్యాలలో స్వామివారి కల్యాణానికి కొండగట్టునుండు వచ్చిన పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే సమర్పించారు. శ్రీరామనవమి వేడుకలను మండల ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కురిక్యాల సింగిల్ విండో మాజీ చైర్మన్ వెలిచాల తిరుమలరావు, పురుమల్ల మనోహర్, సర్పంచులు ముద్దం నగేష్, కదారి రేణుక కనకయ్య, వేముల భాస్కర్, మాజీ వైస్ ఎంపీపీ కర్ర బాపురెడ్డి, నాయకులు కర్ర కార్తీక్ రెడ్డి, కనకట్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య రామయ్యను తాకిన
# సూర్యకిరణాలు..

యూపీలోని అయోధ్య రామ మందిరంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. సరిగ్గా మ. 12 గంటలకు రామ్ లల్లా నుదుటిపై సూర్య కిరణాలు పడ్డాయి. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు రామాలయానికి పోటెత్తారు. దీన్ని కళ్లారా వీక్షించిన వారంతా భక్తపారవశ్యంతో.. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. సూర్యతిలకానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది..

## రామనవమి శోభా యాత్ర ఏర్పాట్లను
# పరిశీలించిన సీపీ



**హైదరాబాద్** శ్రీరామనవమి శోభాయాత్రను పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, శుక్రవారం సీతారాం బాగ్ పరిసరాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మీడియాతో మాట్లాడుతూ, నగరంలో జరగనున్న శ్రీరాముడి శోభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని వెల్లడించారు. ఈ యాత్ర ఇవాళ మధ్యాహ్నం 2 గంటలకు సీతారాం బాగ్ ఆలయం నుంచి ప్రారంభమై, రాత్రి 10 గంటల కల్లా ముగిసేలా పక్కా రూట్ మ్యాప్ సిద్ధం చేశామని తెలిపారు. ఇప్పటికే పలు శాఖల అధికారులతో కలిసి యాత్ర సాగే మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించామని, ఎక్కడా ఎటువంటి ఆటంకాలు కలగకుండా డ్రోన్లు, సీసీ టీవీ కెమెరాల ద్వారా నిరంతరం నిశితంగా పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈ భారీ శోభాయాత్ర కోసం దాదాపు 3 వేల మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు వివరించారు. అంతకుముందు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, కలిసి ఆయన శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## గురునానక్ కాలేజీ విద్యార్థి ఆత్మహత్య

**ఇబ్రహీంపట్నం,** ఇబ్రహీంపట్నంలోని గురునానక్ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతున్న కందిమల్ల సాయి తన హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. నల్లగొండ జిల్లాలోని నందిగూడెం మండలం శ్రీరంగాపురానికి చెందిన సాయి(20) గురునానక్ కాలేజీలో ఈసీఈ రెండవ ఏడాది చదువుతున్నాడు.

## పలు ఆలయాలలలో ఎంపి ఈటల
# శ్రీరామనవమి పూజలు



**సికింద్రాబాద్..**శ్రీరామనవమిని పురస్కరించుకుని కంటోన్మెంట్ లోని పలు రామ మందిరాలలో జరిగిన శ్రీసీతారామ కళ్యాణ మహోత్సవంలో మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. వివిధ రకాల పూలు పండ్లు అలంకరణలతో రామాలయాలు శోభాయామానంగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శ్రీ సీతారాముల కళ్యాణాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

## తెనాలిలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**గుంటూరు..**తెనాలి పట్టణంలో శ్రీరామ నవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు,. తెనాలి పట్టణంలోని వాడవాడలలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. తెనాలి గాడిబావి సెంటర్ల వద్ద సీతారాముల కళ్యాణ ఉత్సవం వైభవంగా జరిగింది. వేదమంత్రాల నడుమ అర్చకులు నిర్వహించిన ఈ దివ్య కళ్యాణ కార్యక్రమాన్ని చూడటానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కళ్యాణం అనంతరం భక్తమహాసైనులకు నుచ్చాలా తరంపరాలను ప్రసాదంగా అందించారు.

భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే తెనాలి హనుమాన్ చౌక్ ప్రాంతంలోని రామమందిరంలో కూడా సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణం పుష్పాలతో అలంకరించి పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ వేడుకల ద్వారా పట్టణంలో భక్తి, ఆధ్యాత్మికత మరింత పెరిగింది. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరూ పాల్గొని పండుగను ఆనందంగా జరుపుకున్నారు. స్థానిక నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంపై భక్తులు అభినందనలు తెలిపారు. మొత్తంగా తెనాలి పట్టణం భక్తిరసంలో మునిగిపోయింది.

## ధ్వజారోహణంతో వైభవంగా శ్రీ కోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**తిరుపతి / ఒంటిమిట్ట 2026 మార్చి 27** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శు క్రవారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్టించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ముందుగా గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, నేత్రోల్మీలనం నిర్వహించారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేసినట్టు చెశారు.

రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాది సకలదేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించి ధ్వజారోహణం నిర్వహించారు.ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు.ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవోలు ఎ. ప్రశాంతి, ఎ. శివప్రసాద్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కీసర హెూలీ మేరీ కళాశాలలో ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు



కీసర(ప్రశ్నన్యూస్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం బోగారంలోని హోలీ మేరీ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య



అతిథిగా జేఎన్టీయూ రిజిస్ట్రార్ డా.కే.వెంకటేశ్వర రావు, విశిష్ట అతిథి మురళి బుక్కపట్నం, గౌరవ అతిథులు రిటైర్డ్ అదనపు డీజీపీ మధ్య ప్రదేశ్ డా.కే.బాబురావు, తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ తో పాటు పలువురు ప్రముఖులు, హిట్స్ కళాశాల ప్రెసిడెంట్ ఏ.వరప్రసాద్ రెడ్డి, సెక్రటరీ శారదారెడ్డి, చైర్మన్ సిద్ధార్థరెడ్డి తదితరులు కలిసి జ్యోతి వెలిగించి సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రెసిడెంట్, చైర్మన్, సెక్రటరీలు మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి హిట్స్ కళాశాలను స్థాపించి విజయవంతంగా 25 సంవత్సరాల సిల్వర్ వేడుకలు జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ కళాశాల నుండి ఎంతో మంది విద్యార్థినీ విద్యార్థులను తీర్చి దిద్ది బంగారు భవిష్యత్ కు బాటలు వేశామని తెలిపారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో పలు ముఖ్య హోదాల్లో స్థిరపడి దేశాభివృద్ధిలో పాలు పంచుకుంటున్నారని తెలిపారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ హిట్స్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు బాగా చదివి ఇంజనీర్లతో పాటు సివిల్స్ పరీక్షలు రాసి ఐఏఎస్, ఐపీఎస్ లు గా విజయం సాధించి దేశానికి సేవ చేయాలని కోరారు. అలాగే న్యాయవ్యవస్థలోకి కూడా రావాలని కోరారు. సమాజంలో పేదరికం నిర్మూలించి, దేశ అభివృద్ధికి కావాల్సిన కొత్త కొత్త ఆలోచనలతో పలు రకాల పరిష్కారాలతో ముందుకు వచ్చి దేశ సేవా చేయాలని కోరారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, పలు రకాల సినీ జానపద గేయాలకు నృత్యాలు ఆహుతుల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## శ్రీరామనవమి వేడుకలలో పాల్గొన్న టిపిసిసి సెక్రెటరీ సెక్రెటరీ, మాజీ కార్పొరేటర్ ఎం ఆర్ శ్రీనివాసరావు



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు డివిజన్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ టిపిసిసి సెక్రెటరీ మాజీ కార్పొరేటర్ ఎంఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీరామనవమి హిందువులకు మంచి పండగానే దానితోపాటు దేవుని కళ్యాణం చేయడం లోక కళ్యాణానికి మంచిదన్నారు. ఈరోజు సేవించే వడపప్పు పానకం లో ఆయుర్వేదం దాగి ఉందని వాటిని సేవించడం వల్ల ఎండాకాలం తట్టుకునే శక్తి మానవులకు వచ్చే విధంగా మన పూర్వీకులు దేవుని ప్రసాదం రూపంలో ఇవ్వడం జరిగిందన్నారు. ఎంతోమంది భక్తులు శ్రీరామనవమి సందర్భంగా అన్న వితరణ చేయడం సంతోషం అన్నారు. హిందువులు అందరూ ఏకతాటిపై వచ్చి హిందూ దేవాలయాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు హిందువులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన సమిష్టిగా ఏకమై ఎదురుకోవాలని ఈ సందర్భంగా ఎం ఆర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## ప్రజలు సంయమనం పాటించి సామాజిక సృహ, బాధ్యతతో మెలగాలి




నిజామాబాద్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో వ్యాపారవేత్త తెలంగాణ రాష్ట్ర పెట్రోల్ పంప్ డీలర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల దినేష్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సోషల్ మీడియా మాధ్యమాలలో పెట్రోల్ , డీజిల్ పై జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరాదని కోరారు . పెట్రోల్ పంప్ యజమానులు చేస్తున్న పనిగా కొందరు మాట్లాడడం బాధాకరంగా ఉందని పెట్రోల్ కంపెనీ ల నుండి వస్తున్న సాదక బాధకాలను నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ద్వారా ప్రజలకు తెలియజేయడం జరిగింది .ప్రజలు ఎవరు కూడా తమ రోజు వారి అవసరాల కొరకు పెట్రోల్ , డీజిల్ కొనుగోలు చేయాలన్నారు.ఫ్యూయల్ సప్లై కొరకు ఎటువంటి అపోహ పెట్టుకోవద్దని కోరారు. కొన్ని కంపెనీలు తమ స్వలాభం కోసం ఇష్టానుసారంగా పెట్రోల్ పంపు డీలర్లను సృష్టించారని పెట్రోల్ పంప్ యజమానులకు వ్యాపారం గిట్టుబాటు కాక సతమతమవుతున్నారని తెలిపారు . ప్రజలు జాగ్రత్తతో అవసరానికి మించి పెట్రోల్ పోయించుకుంటున్నందున అత్యవసర సేవలకు ఆటకం కలుగుతుందని తెలిపారు. ప్రజలు సంయమనం పాటించి సామాజిక సృహతో బాధ్యతతో మెలగాలని పిలుపు నిచ్చారు.

# ధార్మిక వేడుకలు గ్రామ ఐక్యతను, సంప్రదాయాలను బలోపేతం చేస్తాయి

- ఆధ్యాత్మిక స్ఫూర్తిని కలిగించే పవిత్రమైన రోజు "శ్రీరామ నవమి"
- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్
- నీలోజిపల్లిలో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణం





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలోని రామాలయంలో శుక్రవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు మహా అన్నదాన సేవలను ఏర్పాటు చేయగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. సాయంత్రం గ్రామంలో శోభాయాత్రను నిర్వహించి భక్తి వాతావరణాన్ని మరింత అలరించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ శ్రీరామనవమి పర్వదినం ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక స్ఫూర్తిని కలిగించే పవిత్రమైన రోజు అని అన్నారు. గ్రామ ప్రజలంతా కలిసి భక్తిశ్రద్ధలతో కళ్యాణోత్సవాన్ని నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు గ్రామ ఐక్యతను, సాంప్రదాయాలను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నదానసేవా కార్యక్రమాలు, చల్లని త్రాగునీరు,చలువ పందిళ్ళు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సంప్రదాయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. శ్రీ సీతారాముల కృపతో గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

## హనుమాన్ ర్యాలీని విజయవంతం చేయండి

**వి ఎచ్ పి పిలుపు**




నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ఏప్రిల్ 2 వ తేదీన జరిగే హనుమాన్ ధరణి ర్యాలీని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు నగర ప్రజలను కోరారు నగరంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నామని ఈ శోభ యాత్రకు ప్రతి ఒక్కరు సహకరించి సహకరించాలని కోరారు .అటు అధికారులతో పాటు విశ్వహిందూ పరిషత్ సభ్యులు అందరూ కలిసి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. గత సంవత్సరం లక్ష పై చిలుక భక్తులు ఈ ర్యాలీని చూసి ఆనందించారని ఈ సంవత్సరం కూడా భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి పోలీసు వ్యవస్థ సహకరించాలని కోరారు . పోలీస్ వ్యవస్థ తో పాటు మున్సిపల్ అధికారులు మీద ఉన్నతాధికారులు ప్రతి ఒక్కరు సహకరించి ఈ ర్యాలీని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. నగర ప్రజలు ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఈ విలేకరుల సమావేశంలో విశ్వహిందూ పరిషత్ హిందూ విభాగం కార్యదర్శి కృష్ణాజీ దినేష్ ఠాగూర్ విహెచ్పి జిల్లా అధ్యక్షులు హిందు వాహిని జిల్లా అధ్యక్షులు దాసరి సాయి ప్రసాద్ దాత్రిక రమేష్ ,శేఖర్ ,నికేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో వంటగ్యాస్ కొరత లేదు

- బ్లాక్ మార్కెట్ పై కఠిన చర్యలు తీసుకుంటాం
- జిల్లా కలెక్టర్ : గరిమ అగ్రవాల్



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్లజిల్లాలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజల అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయని, వదంతులను నమ్మవద్దని సూచించారు. అవసరానికి మించి బుకింగ్ చేయవద్దని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.గ్యాస్‌ను బ్లాక్‌లో అమ్మడం లేదా పక్కదారి పట్టించడం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ సరఫరాపై ఫిర్యాదుల కోసం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.సమస్యలు ఉంటే 80084 29738 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

## విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా రాములోరి కళ్యాణ వేడుకలు

- అన్నదానం -- ఆధ్యాత్మికతకు ప్రతీక

**సహపంక్తి భోజనం లో పాల్గొన్న సర్పంచ్ : కనుకయ్య**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలోని రామాలయంలోశుక్రవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కనుకయ్య మాట్లాడుతూ...శ్రీ సీతారాముల కళ్యాణం వంటి పుణ్యకార్యాలు గ్రామంలో ఐక్యతను



పెంపొందిస్తాయని అన్నారు. గ్రామ ప్రజలందరూ కలిసి భక్తి భావంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.అన్నదానం మహాదానం అని, భక్తులకు అన్నసేవ చేయడం ద్వారా మనకు పుణ్యం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా శ్రీ ఆంజనేయస్వామి మాలధారణలో ఉన్న భక్తులతో కలిసి సహపంక్తిలో భోజనం చేయడం తనకు ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని, భవిష్యత్తులో కూడా గ్రామ ప్రజల సహకారంతో మరిన్ని ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని సర్పంచ్ కనుకయ్య వెల్లడించారు.

## ముత్యాల సునీల్ రెడ్డి కృషితో ముచ్కూర్ గ్రామాభివృద్ధికి మరో ముందడుగు

- రూ. 15 లక్షలతో తెడ్డు అశోక్ ఆధ్వర్యంలో గాంధీవాడలో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం
- కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు : తెడ్డు అశోక్



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గం, భీంగల్ మండలం, ముచ్కూర్ గ్రామంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి కృషితో రూ. 15 లక్షల నిధులు మంజూరవడంతో, గ్రామంలోని గాంధీవాడ, వరాహస్వామి గుట్ట,పలు ప్రాంతాల్లోని ఈ పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తెడ్డు అశోక్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా తెడ్డు అశోక్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముచ్కూర్ గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు సీసీ రోడ్ల నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ముత్యాల సునీల్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయని, గ్రామంలోని ప్రతి వాడ అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉందని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు.ఈ పనులు పూర్తయ్యాక గ్రామంలో రవాణా సమస్యలు తగ్గి, ప్రజలకు సౌకర్యం పెరుగుతుందని తెలిపారు. ప్రజలు సహకరించి పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొరడి రాజు,పార్టీ గ్రామాధ్యక్షులు మురారి,లింబాద్రి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అవినాష్, తదితర గ్రామ వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణ మహోత్సవంలో మారెడ్డి,కొండల్ రెడ్డి దంపతులు

**సైదాపురం గ్రామంలో వైభవంగా సీతారాముల కళ్యాణం**



యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్) మైలార్‌గూడెం గ్రామంలో శుక్రవారం శ్రీరామ నవమి ని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కళ్యాణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.సీతారాముల కళ్యాణం లో గ్రామసర్పంచ్ మారెడ్డి కొండల్ రెడ్డి దంపతులు,వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.కల్యాణానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హాజరయ్యారు.అలాగే యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు.కళ్యాణం లో గ్రామ ఉప సర్పంచ్ దుబ్బాల వెంకట్ రెడ్డి,గ్రామస్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారి కృప వల్ల వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

## యాదగిరిగుట్ట ప్రధానార్చకులకు 'ఉజ్వల ఉగాది స్వర్ణ నంది' పురస్కారం



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) సాంస్కృతిక మరియు సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేస్తున్న ఉజ్వల సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 'ఉజ్వల ఉగాది స్వర్ణ నంది పురస్కారాలు-2026' వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయ ప్రధానార్చకులకు వారి ధార్మిక సేవలను గుర్తిస్తూ సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

## మేడ్చల్ కేఎల్ఆర్ శివాలయంలో వైభవంగా శ్రీరామ నవమి కళ్యాణోత్సవం



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )మేడ్చల్ కేఎల్ఆర్ ప్రాంతంలోని ప్రసిద్ధ శివాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, భక్తి పరవశంలో పాల్గొన్నారు. ఉదయం ప్రత్యేక పూజలతో ప్రారంభమైన వేడుకలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీరాముడు–సీతమ్మల కళ్యాణం ఘనంగా జరిగింది. ఆలయాన్ని కో, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేసి, వందలాది మందికి ప్రసాదం పంపిణీ చేశారు. స్థానిక ప్రజలు, యువకులు సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం శ్రీరామ నవమిని ఇలాగే ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు కూడా ఇలాంటి కార్యక్రమాలు ఆధ్యాత్మికతను పెంచుతాయని అభిప్రాయపడ్డారు.

## చిన్నక్రాంతి కాలనీలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం



బోడుప్పల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా బోడుప్పల్, చెంగిచెర్ల చిన్నక్రాంతి కాలనీలో కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం. అధిక సంఖ్యలో భక్తులు



పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై అన్నప్రసాదం స్వీకరించారు. సుమారు 1000 మందికి ప్రత్యేక ఏర్పాట్లతో అన్న ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు బాపురాజు మాట్లాడుతూ రాముని ఆశీస్సులతో అందరూ బాగుండాలి, అందులో మనం ఉండాలి అన్న సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం అన్నారు. భక్తులకు సేవ చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం. ఆ భద్రాచలంలో సీతారాముల కళ్యాణం తిలకించినట్టుగా కనిపిస్తుందని తెలిపారు. అనంతరం కార్యదర్శి రాజేందర్ రెడ్డి, కోశాధికారి శివకుమార్, గౌరవ అధ్యక్షుడు గొరిగే నర్సింహా కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ నీలుగొండ వెంకటేష్ గౌడ్ లు మాట్లాడుతూ చినక్రాంతి కాలనీ లో సీతారాముల కల్యాణం, అన్నప్రసాదం నిర్వహించబడడం విశేషం. భక్తి, ఐక్యతను మరింత బలోపేతం చేశాయి. భక్తి, సేవా కార్యక్రమాలు స్థానికుల ప్రశంసలు అందుకుంటున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాముని ఆదర్శాలు ప్రతి ఒక్కరూ అనుసరించాలి

**- అనంతపల్లి గ్రామ ఉప సర్పంచ్, యువ ఫౌండేషన్ అధ్యక్షులు : గొడిశెల తిరుపతి గౌడ్**

**- అనంతపల్లి లో ఘనంగా రాములోరి కళ్యాణం**

**- గొడిశెల కుటుంబం హాజరు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని అనంతపల్లి గ్రామంలో శుక్రవారం స్థానిక ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్, యువ ఫౌండేషన్ అధ్యక్షులు గొడిశెల తిరుపతి గౌడ్ తమ కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలకు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముడు ధర్మానికి ప్రతీకగా నిలిచిన మహానుభావుడని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో న్యాయం, నిజాయితీ, పరస్పర గౌరవం పెంపొందించుకోవాలని, గ్రామ ప్రజలు ఐక్యంగా ఉండి శాంతి, సౌహార్ద వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. శ్రీరామ నవమి వంటి పర్వదినాలు మన సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టే పునాదులని, యువత మంచి విలువలను అలవర్చుకోవాలని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పరవశంలో మునిగిపోయారు.

# రాజన్న క్షేత్రంలో ఘనంగా శ్రీ రాములోరి కళ్యాణ మహోత్సవ వేడుకలు

**- వేములవాడ పట్టణంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం**

**- ప్రత్యేక ఆకర్షణగా జోగినీల పరస్పర వివాహ వేడుకలు**

**- భక్తుల రద్దీతో కిటకిటలాడిన రాజన్న క్షేత్రం**







వేములవాడ (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా హరిహర క్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం లో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన శ్రీ సీతారాముల నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగాయి. తొమ్మిదవ రోజు పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి.

### తొమ్మిదవ రోజు ప్రత్యేక పూజలు..

ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామివారికి పంచోపనిషత్ విధానంలో అభిషేకం నిర్వహించి, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు ఘనంగా జరిపారు.

### యాగశాలలో శాస్త్రోక్త హోమాలు..

నవరాత్రోత్సవాల్లో భాగంగా యాగశాలలో పుణ్యాహవచనం, మూలమంత్ర హోమం, పరివార దేవతల హోమాలు నిర్వహించారు. అనంతరం అగ్ని ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### వైభవంగా కళ్యాణోత్సవం..

ఆలయ పార్కింగ్ ప్రాంగణంలోని శివార్చన వేదికపై శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూలతో, మామిడి ఆకులతో, అరటి తోరణాలతో అలంకరించిన వేదిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి కన్యాదాతలుగా మరింగంటి విజయసారథి--కర్ణ దంపతులు పాల్గొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరై స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకున్నారు.

### భక్తులకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు..

నవరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు రామాయణ పారాయణం, శ్రీరామ గీత, ఆధ్యాత్మిక ప్రవచనాలను నిర్వహించారు. శంకరమఠంలో రామాయణ ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం రథోత్సవం, రాత్రి దోలోత్సవంతో ఉత్సవాలు కొనసాగాయి.

### ప్రత్యేక తలంబ్రాల ఆకర్షణ..

కళ్యాణోత్సవం సందర్భంగా బియ్యపు గింజపై శ్రీరాముని నామం ముద్రించిన తలంబ్రాలను ఆలయ అధికారులు సిద్ధం చేయడం విశేషంగా నిలిచింది. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

### పట్టు వస్త్రాల సమర్పణ..

శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని, వాటిని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు.

### కేంద్ర మంత్రి తరఫున కూడా సమర్పణ..

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తరఫున కూడా పట్టు వస్త్రాలు ఆలయానికి సమర్పించబడ్డాయి. అనంతరం వారు శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### వేములవాడ మున్సిపల్ పక్షాన..

కళ్యాణ వేడుకలలో భాగంగా వేములవాడ పురపాలక సంఘం పక్షాన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ తదితర కౌన్సిలర్లు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

### అర్ధనారీశ్వరుడిని మనువాడిన జోగినీలు..

వేములవాడ రాజన్న ఆలయంలో ప్రతి ఏటా నిర్వహించే శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా జోగినీలు, హిజ్రాలు రాజన్నను మనువాడడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈసారి కూడా



పెద్ద ఎత్తున తరలివచ్చిన వారు పరమశివున్నే వరుడిగా భావించి మంగళసూత్రం ధరించి వివాహం చేసుకున్నారు. తలంబ్రాలు చల్లుకుంటూ భక్తి పారవశ్యంలో మునిగితేలారు. దేశంలో అరుదుగా కనిపించే ఈ ఆచారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

### భద్రతకు పటిష్ట బందోబస్తు..

భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పర్యవేక్షణలో 300 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, వేద పండితులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. మొత్తంగా వేములవాడ రాజన్న క్షేత్రంలో శ్రీ సీతారాముల నవరాత్రి ఉత్సవాలు, కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగాయి.

# కన్నుల విందుగా శ్రీ సీతారాముల కళ్యాణం

**సీతారామ కాలనీలో మార్మోగిన జై శ్రీరామ్**

**కాలనీ వాసులను ఒక్క చోటకు చేర్చిన శ్రీరామ నవమి**

**కళ్యాణం అనంతరం రుచికరంగా అన్నప్రసాద వితరణ**

**హాజరైన ఆలయ ధర్మకర్త బోరిగం శ్రీనివాస్ దంపతులు,**

**అతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ పూదరి సునీత ప్రభాకర్ దంపతులు**

**కాలనీ ప్రెసిడెంట్ శంకరయ్య భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం**



మంచిర్యాల ( ప్రశ్న న్యూస్ ) మంచిర్యాల జిల్లా కేంద్రంలోని 39 డివిజన్ సీతారామ కాలనీలో శ్రీ సీతారామ కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. భక్తుల పాటలతో , మహిళల పసుపు కుంకుమ కార్యక్రమాలతో , భక్తులందరి శ్రీ రామ నామ స్మరణతో రాములోరి కళ్యాణం కనుల విందుగా సాగింది. తొలుత సీతారామ లక్ష్మణ హనుమాన్ ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర చేసిన ఆలయ కమిటీ , అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో ప్రతిష్టింపజేశారు. అనంతరం వేద మంత్రాలతో ఆలయ పూజారి శ్రీ పవన్ శర్మ సీతారాముల వివాహాన్ని ఘనంగా జరిపించారు.

సీతారామ కాలనీలోని శ్రీ శివ పంచాయతన ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణమంతా జై శ్రీరామ్ నామస్మరణతో, భక్తి భావంతో కాలనీ వాసులు పులకించిపోయారు.

### సంప్రదాయాన్ని కొనసాగిస్తాం : ఆలయ ధర్మకర్త

ఏటా సీతారామ కాలనీలోని ఆంజనేయ గుడిలో సీతారాముల కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని , గత 12 ఏళ్లుగా వ్యయప్రయాసలకోర్చి ఈ అనవాయితీ కొనసాగిస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియ అని ఆలయ ధర్మకర్త బోరిగం శ్రీనివాస్ మనిషా దంపతులు అన్నారు.

### సీతారాముల కృప కాలనీకి ఉండాలి : కార్పొరేటర్

శ్రీ రామ నవమి సందర్భంగా 39 డివిజన్ కార్పొరేటర్ పూదరి సునీత ప్రభాకర్ మాట్లాడుతూ సీతారామ కాలనీ వాసులంతా ఒకే కుటుంబంగా కళ్యాణోత్సవం నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు. కాలనీ వాసులు ఐక్యతతో సనాతన ధర్మం పరిరక్షణకు కృషి చేసినట్లేనని అన్నారు. ఇదే ఐక్యత భవిష్యత్ లోనూ కొనసాగాలని ఆకాంక్షించారు. ఆ సీతారాముల దయ , కరుణ , కృప కాలనీ వాసులందరి మీద ఉండాలని అన్నారు.

### సీతారాములోరి కళ్యాణోత్సవం విజయవంతం : ప్రెసిడెంట్ శంకరయ్య

అనంతరం మాట్లాడిన కాలనీ ప్రెసిడెంట్ శంకరయ్య, తమ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సమష్టిగా కృషి చేసి స్వామి వారి కళ్యాణోత్సవం చూడముచ్చటగా నిర్వహించామని , కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కాలనీ వాసులు క్రమశిక్షణగా ఐక్యతతో ఈ వేడుకను అంగరంగ వైభవంగా జరిగేలా కృషి చేశారని , వారికి కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఆలయ ధర్మకర్త , కార్పొరేటర్ దంపతులు సునీత ప్రభాకర్ సహకారాలకు ఆయన కృతజ్ఞతలు



తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బోరిగం శ్రీనివాస్ మనిషా దంపతులు ,కార్పొరేటర్ సునీత ప్రభాకర్ , కాలనీ అధ్యక్షులు డాక్టర్ కుంచాల శంకరయ్య భాగ్యలక్ష్మి దంపతులు, పూజారి పవన్ శర్మ,ట్రెజరర్ తోట సదానందం లావణ్య దంపతులు, ధరణి సమ్మయ్య, బట్టు రాజ్ కుమార్, అయితే పాముల రాజు, గంగాధరి రాజు, గాండ్ల మల్లేష్, జయకృష్, టీచర్స్ భూమా చారి, రఘు బాబు, పీ. శంకరయ్య అన్నం రమేష్, బుద్ధి తిరుపతి, శ్రీనివాస్ గౌడ్ , ఏడి శ్రీనివాస్ పాటు కాలనీ వాసులు , భక్తులు పెద్ద సంఖ్యలో కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు.

## దుబె కాలనీలో శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం వైభవంగా




శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్) శేర్లింగంపల్లి డివిజన్ పరిధిలోని దుబె కాలనీలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం పరిసరాలు అందంగా అలంకరించగా, మంగళ వాయిద్యాల మధ్య స్వామివారి కళ్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణస్వామి, హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో కాలనీ గౌరవాధ్యక్షులు అనిల్ కుమార్ ముదిరాజ్, అధ్యక్షులు గట్టు వెంకటస్వామి, శైలేష్ తివారి, మల్లికార్జున ఆచారి, రాయల ప్రవీణ్ కుమార్, పిల్లి యాదగిరి, జి. రాజు, పి. కృష్ణ తదితర కమిటీ సభ్యులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పూజా కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ వేడుకలకు రాజకీయ నాయకులు కూడా హాజరై భక్తులతో కలిసి పాల్గొన్నారు. టీఆర్ఎస్ నాయకులు అన్నప్రసాదం దాత పొట్ట నరేందర్ యాదవ్ ప్రత్యేకంగా అన్నప్రసాదం ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ నాయకులు చింత కింది రవీందర్ గౌడ్, కేశవ్ గుప్తా, బీఆర్ఎస్ నాయకులు రవికుమార్ యాదవ్, సుప్రజా ప్రవీణ్, మాజీ కార్పొరేటర్ నవతా రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం విరివిగా పంపిణీ చేయగా, కాలనీ ప్రజలు కుటుంబ సమేతంగా హాజరై భక్తి భావంతో పండుగను జరుపుకున్నారు. ఈ మహోత్సవం ద్వారా కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

### కుస్తీ యోధుడిగా

# రామ్ చరణ్..

## అంచనాలు పెంచిన 'పెద్ది' ఫస్ట్ గ్లింప్స్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక అందింది. ఆయన కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. రామ్ చరణ్‌ను మునుపెన్నడూ చూడని అత్యంత రగ్గడ్, మాస్ అవతారంలో చూపించి దర్శకుడు బుచ్చిబాబు సినిమాపై ఆసక్తిని రేకెత్తించారు. ఈ గ్లింప్స్ ప్రారంభంలో వినిపించే 'కుస్తీ అంటే బ్యాట్‌తో బంతికి ఎదురెళ్లే ఆట కాదురా.. ప్రాణంతో చావుకి ఎదురెళ్లే ఆట' అనే సంభాషణ, ఇది కేవలం క్రీడా నేపథ్య చిత్రం కాదని, ఓ యోధుడి జీవన్మరణ పోరాటమని దర్శకుడు చెప్పకనే చెప్పాడు. ఈ పవర్‌ఫుల్ డైలాగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కుస్తీ, క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ డ్రామాలో చరణ్ పాత్ర ఎంతో శక్తివంతంగా ఉండబోతున్నట్టు ఈ గ్లింప్స్ హింట్ ఇచ్చింది. విజువల్స్‌లో రామ్ చరణ్ మేకోవర్ అద్భుతమనే చెప్పాలి. కండలు తిరిగిన శరీరంతో, ఒంటి నిండా మట్టి పూసుకుని, చేతిలో గద పట్టుకుని నడుస్తున్న చరణ్‌ను చూస్తుంటే, 'రంగస్థలం'లోని చిట్టిబాబును మించిన మాస్ అవతార్ అనిపిస్తోంది. ఆయన కళ్లలో కనిపించే పౌరుషం, గంభీరమైన నడక గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచాయి. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ అందించిన నేపథ్య సంగీతం ఈ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. 1980ల నాటి గ్రామీణ వాతావరణాన్ని, కుస్తీ బరిలోని వేడిని తన సంగీతంతో ప్రేక్షకులకు అనుభూతిని కలిగించారు. ప్రస్తుతం ఈ గ్లింప్స్ యూట్యూబ్, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. అభిమానులు చరణ్ కెరీర్‌లో ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. చిత్ర బృందం

### పెళ్లిపై నాకు మంచి

# అభిప్రాయం లేదు

### - సాయిపల్లవి

టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ను సంపాదించుకున్న సాయిపల్లవి... పెళ్లి గురించి, తన వ్యక్తిగత భావోద్వేగాల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తనకు పెళ్లిపై పెద్దగా మంచి అభిప్రాయం లేదని ఆమె తెలిపింది. పెళ్లైన వారు కూడా పెళ్లి చేసుకోవద్దని తనకు సలహా ఇస్తున్నారని చెప్పింది. అందుకే తనకు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదని తెలిపింది. ఒంటరిగానే తాను చాలా ప్రశాంతంగా ఉన్నానని, ప్రస్తుతం తన దృష్టంతా సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది. అయితే, అర్థరాత్రి పూట ఏమీ తినకుండా ఏడుస్తూ కూర్చునే అలవాటు ఉందని తెలిపింది. ఆ సమయంలో కేవలం తన తల్లి మాత్రమే తనకు తోడుగా ఉంటుందని చెబుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. దీంతో, బయటకు ఎంతో నవ్వుతూ కనిపించే సాయి పల్లవి మనసులో ఇంతటి



# 'ధురంధర్ 2'

## వసూళ్ల సునామీ..

### వారంలోనే రూ.1000 కోట్ల క్లబ్‌లోకి!



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. విడుదలైన కేవలం ఏడు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 1000 కోట్ల గ్రాస్ వసూళ్ల మార్కును దాటింది. భారత్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతూ, అతి వేగంగా ఈ ఘనత సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ సినిమా ప్రయాణం ఈ నెల 18న పెయిడ్ ప్రివ్యూలతో ప్రారంభమైంది. ప్రివ్యూల ద్వారానే దేశవ్యాప్తంగా రూ. 43 కోట్ల నెట్ వసూలు చేసి సంచనాలకు తెరలేపింది. ఇక తొలి రోజు (ఝుఎ 1) ఏకంగా రూ. 102.55 కోట్లు రాబట్టి బాక్సాఫీస్ వద్ద తన ఆధిపత్యాన్ని చాటింది. రెండో రోజు శుక్రవారం నాడు స్వల్పంగా తగ్గి రూ. 80.72 కోట్లు వసూలు చేసినా, వారాంతంలో మళ్లీ పుంజుకుంది. శనివారం రూ. 113 కోట్లు, ఆదివారం రూ. 114.85 కోట్లతో అసాధారణ వృద్ధిని నమోదు చేసింది. దీంతో తొలి వారాంతానికే భారత్‌లో నెట్ కలెక్షన్లు రూ. 411 కోట్లు దాటాయి. వారపు రోజుల్లోనూ 'ధురంధర్' జోరు తగ్గలేదు. సోమవారం రూ. 65 కోట్లు, మంగళవారం రూ. 56.60 కోట్లు, ఏడో రోజైన బుధవారం రూ. 48.25 కోట్లు సాధించి స్థిరమైన వసూళ్లను కొనసాగించింది. మొత్తం ఏడు రోజులకు గాను భారత్‌లో ఈ చిత్రం రూ. 623.97 కోట్ల నెట్ కలెక్షన్లు (రూ. 745.23 కోట్ల గ్రాస్) సాధించింది. విదేశాల్లోనూ ఈ సినిమాకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఓవర్సీస్ మార్కెట్‌లో ఏడు రోజుల్లో రూ. 261.92 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. దీంతో సినిమా మొత్తం వరల్డ్‌వైడ్ గ్రాస్ కలెక్షన్ రూ. 1,007.15 కోట్లకు చేరింది. పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న ఈ చిత్రం, రాబోయే రోజుల్లో ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందోనని ట్రేడ్ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.



### ప్రతి చిన్న విషయానికీ 'సారీ' చెప్పే అలవాటును

## మహిళలు ఇకనైనా ఆపాలి: సమంత

హీరోయిన్ సమంత రూత్ ప్రభు సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై మరోసారి తన గళాన్ని బలంగా వినిపించారు. గుర్తింపు పొందాలన్నా, తమను తాము నిరూపించుకోవాలన్నా మహిళలు ప్రతిదానికీ రెట్టింపు కష్టపడాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమంత.. మహిళల స్థితిగతులపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా పంచుకున్నారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సమాజంలో ఇతరుల సౌకర్యం కోసం మహిళలు తమ అభిప్రాయాలను, షెడ్యూళ్లను, చివరికి తమ ఆశయాలను కూడా త్యాగం చేయడం ఒక సాధారణ విషయంగా మారిపోయిందని సమంత పేర్కొన్నారు. తమ వ్యక్తిత్వాన్ని పక్కనపెట్టి ఇతరుల కోసం జీవించడం, వెనక్కి తగ్గడం మహిళలకు అలవాటైపోయిందని అన్నారు. ఈ త్యాగాలను చాలాసార్లు వారే గుర్తించలేని స్థితిలో ఉంటారని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మహిళలకు ఆమె ఒక ముఖ్యమైన పిలుపునిచ్చారు. పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువగా క్షమాపణలు చెబుతుంటారని, ప్రతి చిన్న విషయానికీ 'సారీ' చెప్పే అలవాటును ఇకనైనా ఆపాలని సూచించారు. "మనం మన స్థానాన్ని అర్హతతోనే సంపాదించుకున్నాం. కాబట్టి ఎవరైనా ప్రశంసించినప్పుడు దాన్ని గర్వంగా స్వీకరించాలి" అని సమంత అన్నారు. సినిమాల విషయంలో సామ్ మాట్లాడుతూ.. ఒక చిత్రాన్ని 'ఫీమేల్ లీడ్' సినిమా అని ప్రత్యేకంగా ట్యాగ్ చేయాల్సిన అవసరం లేని రోజు రావాలని ఆకాంక్షించారు. మహిళా పాత్రలు కేవలం హీరోకు సహాయపడేవిగా కాకుండా, స్వతంత్రంగా నిలబడేలా శక్తిమంతంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే షూటింగ్ సెట్స్‌లో మహిళల భద్రత అనేది ఒక చర్చనీయాంశంగా కాకుండా పరిశ్రమలో ఒక ప్రాథమిక ప్రమాణంగా మారాలని ఆమె పేర్కొన్నారు. ప్రతి నటి సెట్‌లో పూర్తి భద్రతా భావంతో పనిచేసే వాతావరణం ఉండాలని సమంత కోరారు.

## 'బ్యాండ్ మేళం' మూవీ రివ్యూ



'కోర్ట్' చిత్రంతో అలరించిన జంట హర్ష రోషన్, శ్రీదేవి ముఖ్యతారలుగా నటించిన తాజా చిత్రం 'బ్యాండ్ మేళం'. పలు విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన కోన వెంకట్ తన నిర్మాణ సంస్థలో ఈ చిత్రాన్ని నిర్మించాడు. 'కోర్ట్' చిత్రంతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ యువ జంటకు 'బ్యాండ్ మేళం' మూవీ సక్సెస్‌ను అందించందా? సినిమాలో ప్రేక్షకులను అలరించే అంశాలున్నాయా? లేదా అనేది చిత్ర సమీక్షలో తెలుసుకుందాం.. గిరి (హర్ష రోషన్) తనకు చదువు సరిపడదని చదువును మధ్యలోనే మానేసి సంగీత దర్శకుడు అవ్వాలనే కోరికతో ఫ్రెండ్స్‌తో కలిసి ఓ బ్యాండ్ బ్యాచ్‌ను రన్ చేస్తుంటాడు. గిరి మరదలు రాజీ (శ్రీదేవి) చదువులో టాపర్‌గా ఉంటుంది. ఈ ఇద్దరికి పెద్దయ్యాక పెళ్లి చేయాలని ఇరువురి తల్లిదండ్రులు చిన్నప్పుడే నిర్ణయించుకుంటారు. కానీ పరిస్థితులు మారిపోవడం. దీనికి తోడు గిరి చదువుకోకుండా, ఎటువంటి లక్ష్యం లేకుండా ఉండటంతో రాజీ కూడా గిరిని దూరం పెడుతుంది. కానీ గిరి మాత్రం రాజీ తనకు కాబోయే భార్య అని అందరికి చెప్పుకొంటుంటాడు. కానీ రాజీ తండ్రి, సాయన్న (సాయికుమార్) ఓ పెళ్లి సంబంధం చూసి రాజీకి పెళ్లి చేయాలని అనుకుంటాడు. ఈ సమయంలో రాజీ ఏం చేసింది? రాజీ, గిరిల పెళ్లి జరిగిందా? గిరి తన మరదలు మనసు గెలిచాడా? లేదా? సంగీత దర్శకుడిగా ఎదగాలనే అతని కల ఫలించిందా? లేదా తదితర విషయాల్ని వెండితెరపై చూసి తెలుసుకోవాల్సిందే. బావ మరదళ్ల ప్రేమకథతో ఇప్పటి వరకు తెలుగులో చాలా సినిమాలొచ్చాయి. ఆ నేపథ్య కథతో వచ్చిన ఈ సినిమా చూస్తుంటే ప్రతి సన్నివేశంలో ఆ పాత సినిమాలే గుర్తొస్తాయి. ఏ మాత్రం కొత్తదనం లేని రోటిన్ కథతో, బలహీనమైన సన్నివేశాలతో, అలరించని పాత్రలతో రూపొందించిన సినిమా ఇది. కథ, కథనాలు ఎంతో రొటిన్‌గా బోరింగ్‌గా అనిపిస్తాయి. సినిమా ప్రారంభం నుంచే అందరిలో ఈ పీల్ కలుగుతుంది. ఓ కొత్త తరహా కథతో, ఓ కొత్త సన్నివేశంతో ప్రేక్షకులను అలరించాలనే తపన మచ్చుకు కూడా సినిమాలో కనిపించదు. హీరో, హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలతో పాటు ప్రతి సీన్ భారంగా నడుస్తుండటంతో సినిమా ఆద్యంతం ఎక్కడా కూడా ఆసక్తిని కలిగించదు. తొలిభాగం సహనానికి పరీక్షగా నిలిస్తే.. రెండో భాగం చూడాలని ఓపికగా థియేటర్‌లోనే ఉన్నవాళ్లకు ఇంటర్వెల్ తరువాత వచ్చే సన్నివేశాలు కూడా అంతకు మించిన పరీక్షగా మారిపోతాయి. ఈ చిత్రంలో పాత్రలు కూడా సరైన రీతిలో దర్శకుడు తీర్చిదిద్దలేదు. హీరో, హీరోయిన్లు, ఇతర పాత్రలు మాట్లాడే తెలంగాణ యాస సహజంగా అనిపించదు. 'కోర్ట్' ద్వారా రోషన్, శ్రీదేవిల జంటకు వచ్చిన క్రేజ్‌తో ఇమ్మీడియట్ మరో సినిమా తీసేయాలనే హడావుడే తప్ప, ఓ మంచి సినిమాను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశం మేకర్స్‌లో ఉన్నట్లుగా కనిపించలేదు. 'కోర్ట్' సినిమాలో టీనేజ్ జంటగా అలరించిన ఈ జంట పాత్రలు ఈ సినిమాలో సరైన రీతిలో తీర్చిదిద్దకపోవడంతో రెండూ పాత్రలు ఆకట్టుకునేల లేవు. గిరిగా హర్ష్ రోషన్ నటన పరిధి మించిన విధంగా కనిపిస్తుంది. చాలా చోట్ల ఆయన డైలాగ్ డెలివరీ, నటన, హావాభావాలు శ్రుతి మించినట్లుగా అనిపిస్తుంటాయి. శ్రీదేవి పాత్ర కూడా అంతగా ఆకట్టుకోదు. కథ, కథనంలో బలం లేకపోవడంతో ఏ పాత్ర కూడా అలరించే విధంగా లేదు. విజయ్ బుల్గానిన్ సంగీతం ఆయన మార్క్‌లో లేదు, రచయితగా ఎన్నో విజయవంతమైన చిత్రాలకు కథను అందించిన కోన వెంకట్ ఇలాంటి నాసిరకం కథతో, నీరసమైన సన్నివేశాలతో ఇలాంటి సినిమా తీయడం అందరిని ఆశ్చర్యపరుస్తుంది. దర్శకుడు సతీష్ జవ్వాజి ఏ విషయంలో కూడా తన ప్రతిభను చూపలేకపోయాడు. సినిమాలో కొత్తదనం కోసం రచన బృందం కనీసం ప్రయత్నించినట్లుగా అనిపించదు.

# భారతదేశ ప్రజల సమస్యలపై...

## ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ఘాటుగా స్పందించారు..




మంథని ( ప్రశ్న న్యూస్)పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై ఇంధన ధరల పెరుగుదలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత 10 సంవత్సరాల్లో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉండడం సాధారణ ప్రజలపై భారంగా మారిందని ఆయన పేర్కొన్నారు.ప్రత్యేకంగా, క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 50--60 డాలర్ల మధ్య ఉన్న సమయంలో కూడా, పెట్రోల్ ధర లీటర్‌కు ?100 వరకు పెరగడం అన్యాయం అని విమర్శించారు. ఈ కాలంలో ప్రభుత్వం సుమారు ?25 నుండి ?30 లక్షల కోట్ల వరకు పన్నుల రూపంలో వసూలు చేసిందని, ఆ డబ్బు ఎక్కడ వినియోగించబడిందో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.అదేవిధంగా, ఎల్పీజీ గ్యాస్ కొరతపై వస్తున్న నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. దేశంలో కేవలం ఒక నెలకు సరిపడే గ్యాస్ నిల్వలు మాత్రమే ఉన్నాయనే వార్తలు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని తెలిపారు.హైదరాబాద్ సహా తెలంగాణలో పెట్రోల్ బంక్‌ల వద్ద ప్రజలు పెద్ద ఎత్తున చేరడం, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయని వంశీ కృష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రజల్లో నమ్మకం కల్పించాల్సిన అవసరం ఉందని పానిక్ మోడ్‌లోకి నెట్టే విధంగా పరిస్థితులు మారకూడదని, సరఫరా వ్యవస్థను బలోపేతం చేసి, ఇంధన ధరలను తగ్గించే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ కోరారు.

# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

## భారీగా పాల్గొన్న భక్తులు



తార్నాక(ప్రశ్న న్యూస్) ప్రతి సంవత్సరం శ్రీరామనవమి వేడుకలు అంటే దేశంలో ప్రతి ఇంట్లో పండగ వాతావరణం ఉంటుంది. దానితోపాటు హిందువులలో విపరీతమైన దేశభక్తి, దైవభక్తి ఏర్పడతాయి. తార్నాక విజయపురి కాలనీలోని శ్రీ బాల ప్రసన్న ఆంజనేయ శివాలయంలో శ్రీరామ



నవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీరాముడు సీతమ్మకు కళ్యాణం నిర్వహించారు. కొంతమంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడింది.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేపట్టి, వచ్చిన భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా భక్తులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. కార్యక్రమం శాంతియుతంగా, భక్తిమయ వాతావరణంలో సాగింది.

# 22వ వార్డులో కన్నులపండువగా

# శ్రీ సీతారాముల కళ్యాణం

**రామనామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం**

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న కౌన్సిలర్ సద్ది నిషితాబుచ్చిరెడ్డి దంపతులు**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని 22వ వార్డులో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. గుంటి కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కోనాయిపల్లి గ్రామంలో గల ఆంజనేయ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నులపండువగా సాగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి కౌన్సిలర్ సద్ది నిషితాబుచ్చిరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేద మంత్రోచ్చారణల మధ్య వారు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, తలంబ్రాలు పోశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సద్ది నిషితాబుచ్చిరెడ్డి మాట్లాడుతూ లోక కల్యాణం కోసం శ్రీరాముడు చూపిన మార్గం ఆచరణీయమని, వార్డు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వార్డు ప్రజలు, గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా రామనామస్మరణతో మారుమోగింది. స్వామివారి కళ్యాణం అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన ప్రసాద వితరణలో వార్డు ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రముఖులు, యువకులు మరియు భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని దిగ్విజయం చేశారు.

# వైభవోపేతంగా శ్రీ సీతారాముల కళ్యాణం

**- అన్ని గ్రామాల్లోనూ రాముల కళ్యాణ వేడుకలు**





మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండలంలోని గుంజపడుగు, శ్రీరామ్ నగర్, మైదుపల్లి, ఆరెంద, వెంకటాపూర్, ఎగ్లాస్పూర్, సూరయ్య పల్లె, నాగారం, మల్లేపల్లి గ్రామాలతో పాటు మంథని పట్టణంలోని గోదావరి నది తీరంలో గల శ్రీ కోదండ రామాలయం, శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం, శ్రీ అయ్యప్ప దేవాలయంలో లోక కళ్యాణార్థం శ్రీ సీతారామ చంద్రుల కళ్యాణ వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. ఈనెల 19న ప్రారంభమైన శ్రీరామనవరాత్రి ఉత్సవములు శుక్రవారం రాముల కళ్యాణం తో ఘనంగా ముగిశాయి. పునర్వసు నక్షత్ర యుక్త మిధున లగ్న పుష్కరాంశ సుమూహూర్తమున శ్రీ సీతారాముల కళ్యాణం జరిపించారు. కళ్యాణ వేడుకలు తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. కళ్యాణ వేడుకలు నిర్వహించిన ప్రాంతాల్లో నిర్వాహకులు అయ్యప్ప దేవాలయంలో కొమురవెల్లి సునీత విజయ్ కుమార్, నాగేశ్వర్ శర్మ దంపతులు, ఈ కళ్యాణం జరిపించారు అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షులు ఓడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నూకల శంకర్, ఆలయ కమిటీ సభ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారూ తర్వాత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళ్యాణ అక్షింతలు తలపై వేసుకొని భక్తులు పునీతులయ్యారు.

# కంటోన్మెంట్ బోర్డు విలీనం

# పై సర్కార్ కసరత్తు: మంత్రి శ్రీధర్ బాబు


**-తెలంగాణ ప్రభుత్వం బోర్డు పరిధిలో మౌళిక సదుపాయాల పై పూర్తి ఇక స్థాయిలో ఫోకస్**

**-కంటోన్మెంట్ లో నివాస ప్రాంతాలను మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు 11తీసుకువెళ్తుందని అసెంబ్లీ సాక్షిగా మంత్రి వెల్లడి**

**-అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగంలో కంటోన్మెంట్ పై కీలక విషయాలు**



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) గత కొన్నేళ్లుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రజలు రెండో తరగతి శ్రేణులు గా జీవిస్తున్న విషయం విదితమే.అలాగే వారు ఎదుర్కొంటున్న మౌళిక సమస్యల పై ఎన్ని మార్లు పోరాటాలు,ఉద్యమాలు జరిగిన ఇసుమంతైనా ప్రజలకు న్యాయం జరగలేదని స్థానిక పౌరుల మనోవేదన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే గా గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే శ్రీ గణేష్ స్థానిక సమస్యలు ప్రభుత్వం దృష్టికి పదే పదే తీసుకెళ్లడంతో పాటు మొన్నీమధ్య ఆమరణ నిరాహారదీక్ష సైతం చేపట్టిన విషయం అందరికి తెలిసిందే.కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అధీనంలో ఉన్న పరిపాలన వ్యవస్థకు ముగింపు పలకాలనే ఆలోచనతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ను జిహెచ్ఎంసి లో మేర్జ్ చేయాల్సిందే అని పలు ప్రసంగాల్లో తెలిపిన సందర్భాలు కోకొల్లలు.అది గాక సాక్షతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న మౌళిక సమస్యల పై లేఖ కూడా అందజేసిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో నిన్న అసెంబ్లీ సాక్షిగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలనే నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛను దృష్టిలో పెట్టుకొని,పౌర సేవలు రాష్ట్ర



ప్రభుత్వ ఆధీనంలో ఉంటే హైదరాబాద్ లోని మిగిలిన ప్రాంతాల వలే కంటోన్మెంట్ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని, విలీన ఆవశ్యకతను స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి కంటోన్మెంట్ లోని నివాస ప్రాంతాలను మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి,రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ ప్రాంతంలోని నివాస ప్రాంతాలు మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం కావడానికి నిబద్ధతతో పని చేస్తుందని,విలీన ప్రక్రియ ముందుకు వెళ్ళడానికి తగిన చర్యలు తీసుకుంటుందనిమంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గురువారం రాత్రి అసెంబ్లీ వేదికగా ప్రకటన చేశారు.ప్రస్తుతం కంటోన్మెంట్ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు మహేంద్ర హిల్స్ లో నీటి స్టోరేజ్ ట్యాంక్ ను నిర్మాణం చేస్తున్నామని కూడా మంత్రి ప్రకటించడం విశేషం.నియోజకవర్గం ప్రజల మనోభావాలను గుర్తించి విలీన ప్రక్రియను ప్రారంభించినందుకు,తన వినతులతో నియోజకవర్గంలో నీటి ఎద్దడిని నివారించేందుకు స్టోరేజ్ ట్యాంక్ లను నిర్మిస్తున్నందుకు ప్రభుత్వానికి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,అసెంబ్లీలో ప్రకటన చేసినందుకు మంత్రి శ్రీధర్ బాబుకి నియోజకవర్గ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్.

# షెడ్యూల్ కులాల జీవనోపాధికి ఆర్థిక భరోసా

- **యూనిట్ల వారిగా ఆర్థిక సహాయం.. గిగ్ డ్రైవర్లకు అధిక ప్రాధాన్యం**
- **మహిళలకు 33 శాతం, వికలాంగులకు 5 శాతం ఆర్థిక భరోసా**
- **ఆన్లైన్లో దరఖాస్తు, ఏప్రిల్ 2 చివరి తేదీ**
- **మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు 341 యూనిట్లు మంజూరు**



**షెడ్యూల్ కులాల జీవనోపాధికి ఆర్థికంగా చేయూతనందించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తుంది. ఆర్థికంగా ఆన్లైన్ వ్యాపారాలు చేసే వారికి, డ్రైవర్లకు ప్రభుత్వం అందించనున్న ఈ చేయూత భవిష్యత్తుకు దారిదీపంగా మారనుంది. షెడ్యూల్ కులాల కోసం విద్యుత్ ద్విచక్ర, త్రిచక్ర వాహనాల కొనుగోలు, వ్యవసాయానికి సంబంధించిన సోలార్ యూనివర్సల్ పంపు సబ్సిడీతో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 341 యూనిట్లు మంజూరయ్యాయి. దళిత గిగ్ వర్కర్లు, డ్రైవర్లకు, రైతులకు అండగా నిలవడం ద్వారా ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు అందించాలన్నదే ఈ పథకం సమున్నత లక్ష్యం. లబ్ధిదారులకు ఈ చేయూత అందితే వారిని నిత్య జీవనంలో ఆర్థిక ప్రమాణాలు వేగంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తుంది.**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో దళిత గిగ్ వ్యాపారులకు సబ్సిడీతో 341 యూనిట్లు మంజూరు అయ్యాయి. జిల్లాలో విద్యుత్ ద్విచక్ర వాహనానికి 215 యూనిట్లు (యూనిట్ విలువ, రూ. లక్ష)కు 90 శాతం సబ్సిడీతో రూ. 90 వేలు, రూ 10 వేలు బ్యాంక్ ఋణం ఇవ్వనుంది. మూడు చక్రాల వాహనాలకు యూనిట్ విలువ రూ 3 లక్షలు, 105 యూనిట్లు మంజూరు కాగ 70 శాతం సబ్సిడీతో రూ.2,10,000, రూ. 90 వేల బ్యాంక్ ఋణం, వ్యవసాయానికి సంబంధించిన సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ కు 21 యూనిట్లు మంజూరు కాగ, యూనిట్ విలువ రూ. 3 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు ఉంది. 60 శాతం సబ్సిడీతో, 40 శాతం బ్యాంక్ ఋణం అందించనుంది.

### వ్యాపారులకు, డ్రైవర్లకు అధిక ప్రాధాన్యం..

షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి ఆధ్వర్యంలో రవాణా, వ్యవసాయ సంబంధిత సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్ యూనిట్ల పథకంలో వీధి వ్యాపారులు, డ్రైవర్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు.. దళిత బంధు పథకం పొందిన లబ్దిదారులను అనర్హులుగా గుర్తించనున్నారు. స్వయం ఉపాధి పథకంలో మొదటిసారిగా వినియోగించుకుని, స్వయం ఉపాధిలో నైపుణ్యం కలిగిన వారికి, దివ్యాంగులకు 5 శాతం, మహిళలకు 33 శాతం ప్రాధాన్యత ఇవ్వనున్నారు.. వాహన సంబంధిత పథకానికి ఆన్లైన్ వ్యాపారం చేసే జొమాటో, స్విగ్గి, ర్యాపిడో, ఉబర్ లకు అవకాశం కల్పించనున్నారు.

### దరఖాస్తులు ఇలా..

రవాణా పథకం, వ్యవసాయ ఆధారిత పథకానికి అర్హులైన షెడ్యూల్ కులానికి చెందిన వీధి వ్యాపారులు దరఖాస్తులు చేసుకోవాలి. ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో, కుల ధ్రువీకరణ పత్రం, పట్టణ ప్రాంతంలో రూ.2 రెండు లక్షల వార్షిక ఆదాయం మించకుండా ఉండాలి. రవాణా పథకానికి 21 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలు మించకుండా ఉండి పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. వ్యవసాయ ఆధారిత పథకానికి 21 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్న వారు కనీసం 2 ఎకరాల వ్యవసాయ సాగు భూమి, బోరు కలిగి ఉండాలి.

### అవకాశం సద్వినియోగం చేసుకోవాలి : బాబు మోజెస్ , ఎస్సీ కార్పొరేషన్ ఈడి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా

ప్రభుత్వం రవాణ, వ్యవసాయ ఆధారిత పథకాలకు గాను షెడ్యూల్ కులాల నుంచి అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని



సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైన లబ్ధిదారులు ఏప్రిల్ 2వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇతరాత్ర వివరాలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రెండవ అంతస్తులో ఉన్న షెడ్యూల్ కులాల కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

# అధికారులకు వాటాలా.? చర్యలు లేవు

- అక్రమ నిర్మాణాలపై చర్యలు అంటే ముఖం చాటేస్తున్న అధికారులు
- అక్రమ నిర్మాణదారులతో లంచాలు తీసుకొని చర్యలు మరిచారన్న ఆరోపణలు
- కవాడిగూడ సర్కిల్లో ఎటు చూసినా సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య అవినీతి లీలలు
- నోటీసులు ఇవ్వడం, సెటిల్మెంట్లు చేసుకోవడం, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే
- జిహెచ్ఎంసి ఆదాయానికి గండి కొడుతున్న చర్యలు తీసుకొని డిప్యూటీ, జోనల్ కమిషనర్లు
- కాంగ్రెస్ ప్రభుత్వం లో అవినీతి అధికారులపై చర్యను తీసుకోలేని దుస్థితి




ముషీరాబాద్ (ప్రశ్న న్యూస్) కవాడిగూడ సర్కిల్లో అక్రమ నిర్మాణాల అడ్డగోలుకు అడ్డుకట్ట వేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు చేతులెత్తేసినట్టే కనిపిస్తున్నారు. మున్సిపల్ నిబంధనలు, చట్టాలు అన్నీ పక్కన పెట్టి అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నా వాటిపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం మౌనం వహించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య అవినీతిపై స్థానికుల నుండి వినిపిస్తున్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

### చర్యలు లేకుండా ఇంత భారీగా అవినీతా.?

కవాడిగూడ సర్కిల్ అధికారుల నిర్లక్ష్యమా.? లేక అవినీతి వ్యామోహమా.? అర్థం కాని పరిస్థితి. కవాడిగూడ సర్కిల్ పరిధిలో రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ నిర్మాణాలు, రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని ఐదు అంతస్తుల నిర్మాణాలు, అక్రమ సెల్లార్లు, సెట్ బ్యాక్ లు పాటించని బిల్డర్లు, ఇలా చాలా అక్రమ నిర్మాణాలు విస్తరిస్తున్నాయనే ఆరోపణలు కొత్తవి కావు. కానీ ఇటీవల పరిస్థితి మరింత దిగజారినట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు ఎత్తుకు ఎత్తుకు ఎదుగుతుంటే, వాటిని అరికట్టాల్సిన అధికారులు మాత్రం కళ్ళు చెదిరినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.ప్రత్యేకంగా రామ్ గోపాల్ పేటలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు భారీగా లంచాలు తీసుకొని, బిల్డర్లు అన్ని నిబంధనలు ఉల్లంఘిస్తూ ఆకాశాన్ని తాకే నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదులు, మీడియా కథనాలు వచ్చినా కూడా అధికారులు స్పందించకపోవడం వెనుక పెద్ద స్థాయిలో లంచాలు తిన్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇక పక్కింటి నెంబర్ 2-4-65/68 వద్ద భారీ అక్రమ నిర్మాణం అయితే పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా సాగుతోందని తెలుస్తోంది. సెల్లార్ నిర్మాణం అనుమతి లేకుండా చేపట్టడమే కాకుండా, అదనపు అంతస్తులు నిర్మించడం ద్వారా భవన నిర్మాణ నియమాలను పూర్తిగా ధిక్కరించారు. ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో అసహనాన్ని పెంచుతోంది. దానికి తోడు స్థానిక ఎమ్మెల్యేల పేరు చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.అదేవిధంగా ఆవుల మందా ప్రాంతంలో ఎదురింటి నెంబర్ 3-2-36 వద్ద కూడా భారీ అక్రమ నిర్మాణం కొనసాగుతోంది. అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుండగా, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇది పూర్తిగా దగ్గరపడింది. ఈ రెండు భారీ అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే నోటీసులు జారీ చేసి కూల్చివేతలు చేయకుండా మామూళ్లు తీసుకున్నట్లు సమాచారం. అయితే నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం తప్ప, కూల్చివేత చర్యలు చేపట్టకపోవడం అధికారుల లంచాల వైఖరి ఆందోళన కలిగిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.
"నోటీసులు ఇవ్వడం ఒకటేనా? అమలు చేయడం కూడా బాధ్యత కాదా?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### వసూల్ రాజా అంతా నీ అవినీతే..

అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం ఫైళ్లకే పరిమితం కావడం వెనుక కారణాలేమిటని స్థానికులు నిలదీస్తున్నారు.మరోవైపు, టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు "వసూల్ రాజాలు"గా మారిపోయారని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాల వద్దకు వెళ్లి చర్యలు తీసుకోవాల్సింది పోయి, లావాదేవీలు జరిపి వాటిని కొనసాగించేందుకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపించడం ఆందోళనకరంగా మారాయి. కవాడిగూడ సర్కిల్ లో ఈ పరిస్థితి చూస్తుంటే అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య వాటిని ప్రోత్సహిస్తున్నారనే భావన కలుగుతోంది.డిప్యూటీ, జోనల్ కమిషనర్లు కూడా ఈ వ్యవహారంపై మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నా స్పందించకపోవడం వెనుక కారణం ఏమిటి.? ఇది నిర్లక్ష్యమా.? లేక మౌనం వెనుక మరేదైనా అవినీతి దందా ఉందా.? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ చట్టాలను, ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన డిప్యూటీ జోనల్ కమిషనర్లు మౌనంగా ఉండటం ప్రజల్లో మున్సిపల్




చట్టంపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది.

### డిప్యూటీ, జోనల్ కమిషనర్లు స్పందించేనా.?

సికింద్రాబాద్ జోన్ పరిధిలో జరుగుతున్న అనేక అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్ స్పందించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.అక్రమ నిర్మాణాలు కేవలం నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు. ఇవి భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని అప్పుడు ప్రస్తుత ఉన్న అధికారులు బాధ్యత వహిస్తారా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సరైన అనుమతులు లేకుండా, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన భవనాలు ఎప్పుడైనా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఇలాంటి అక్రమ నిర్మాణాలు పెరగడం వల్ల స్థానికులకు, పక్కింటి ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుంది.అదే సమయంలో, ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం కలుగుతోంది. అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేయడం వల్ల ప్రభుత్వం ఫీజులు, పన్నులు కోల్పోతుంది. దీనివల్ల అధికారుల అవినీతితో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం ఉన్నత అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా



నిలుస్తోంది.ఇప్పటికైనా డిప్యూటీ కమిషనర్ పుష్పలత, జోనల్ కమిషనర్ మంగతాయారు స్పందించి ఈ అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటారా.? అన్న ఆశతో స్థానికులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నోటీసులు ఇచ్చిన నిర్మాణాలను వెంటనే కూల్చివేసి, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య, చైన్ మెన్ ల పై కూడా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### నిర్లక్ష్యంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్

జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ పై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు కమిషనర్ విధులు నిర్వహిస్తున్నారా కేవలం ఉదయం పూట అక్కడ ఇక్కడ పర్యటనలు చేసి పత్రికలలో హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై పత్రికలలో కథనాలు వచ్చి ఇన్వార్డ్, ప్రజావాణిలో ఫిర్యాదులు వచ్చిన కమిషనర్ చర్యలు తీసుకోకపోవడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా మారుతుంది ఇలాంటి కమిషనర్ల వల్లే నగరం అక్రమ నిర్మాణాలకు అడ్డగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు.
నగరంలో ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే, వాటిని అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించకపోతే, దిగువ స్థాయి అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతి మరింత పెరుగుతుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. లక్షల లో జీతాలు తీసుకొనిప్రభుత్వ డ్యూటీ చేస్తున్నారా.? లేక అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారా.? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజల ప్రాణాలు, ప్రభుత్వ ఆదాయం, నగర అభివృద్ధి అన్నీ పణంగా పెట్టి అక్రమ నిర్మాణాలు కొనసాగుతుంటే జిహెచ్ఎంసి కమిషనర్ సిసిపి, జోనల్ కమిషనర్లు మౌనం వహించడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదు.ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని, సికింద్రాబాద్ జోన్, కవాడిగూడ సర్కిల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఈ అక్రమాల అడ్డగోలుకు చెక్ పెట్టడం అసాధ్యంగా మారే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# బెంగాల్లో ఉత్పత్తయ్యే ఎల్పీజీ రాష్ట్రం దాటిపోకూడదు


- ఈ దేశం బీజేపీ వ్యక్తిగతం కాదంటూ దీదీ ఫైర్



కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం (ఈసీ) తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఎల్పీజీ సంక్షోభం నెలకొన్న తరుణంలో, ఇక్కడ ఉత్పత్తి అవుతున్న గ్యాస్ను బయటకు పంపవద్దని ఆమె డిమాండ్ చేశారు. అదే సమయంలో, ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తున్నారంటూ ఎన్నికల సంఘంపై సంచలన ఆరోపణలు చేశారు. పశ్చిమ బర్ధమాన్ జిల్లాలో ఎన్నికల ప్రచారానికి వెళ్లే ముందు, కోల్కతా విమానాశ్రయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, "ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో పశ్చిమ బెంగాల్లో ఉత్పత్తి అయిన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను రాష్ట్రం దాటి వెళ్లనివ్వకూడదు. ఎన్నికల ముందు ఈసీ పెద్ద ఎత్తున బ్యూరోక్రాట్లు, పోలీసు అధికారులను బదిలీ చేయడం, ఇతర రాష్ట్రాలకు డిప్యుటేషన్పై పంపడం వంటి చర్యల వల్ల ఇక్కడి గ్యాస్ను బయటకు తరలించే ప్రమాదం ఉంది. అసెంబ్లీ ఎన్నికల కోసం భారీ సంఖ్యలో ఎన్నికల సిబ్బంది, కేంద్ర బలగాలు రాష్ట్రానికి వస్తున్నాయి. వారి అవసరాల కోసం గ్యాస్ను కేటాయించి, రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు" అని ఆమె స్పష్టం చేశారు. అనంతరం ఎన్నికల సంఘంపై మమత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అనుబంధ ఓటర్ల జాబితాను విడుదల చేశామని ఈసీ చెబుతున్నా, ఇప్పటివరకు తమకు దాని హార్డ్ కాపీలు అందలేదని ఆరోపించారు. "ఇది కచ్చితంగా ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమే. చాలా దురదృష్టకరం. వారికి ధైర్యం ఉంటే, జాబితాను పారదర్శకంగా బయటపెట్టాలి. తమ పేర్లు ఉన్నాయో లేదో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి" అని ఆమె డిమాండ్ చేశారు. ఈ తప్పులకు పాల్పడిన వారు ఏదో ఒక రోజు ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. "ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పుల కోసం ప్రతి జిల్లాలో ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి. ఈ దేశం ఏమైనా బీజేపీ వ్యక్తిగత ఆస్తి అనుకుంటున్నారా?" అని మమత ఘాటుగా ప్రశ్నించారు.

# లఢఖ్లో భారీగా మంచు తుపాను

- ఆరుగురి మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు



**లేహ్ (ప్రశ్న న్యూస్)** లఢఖ్లోని జోజిలా పాస్ సమీపంలో శుక్రవారం ఘోర ప్రమాదం జరిగింది. శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై భారీగా మంచు చరియలు విరిగిపడటంతో పలు వాహనాలు వాటి కింద చిక్కుకుపోయాయి. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు చేపట్టిన అధికారులు, తొలుత ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని భావించారు. అయితే, గాలింపు చర్యలు కొనసాగిస్తుండగా, మంచు కింద కొన్ని వాహనాలు పూర్తిగా కూరుకుపోయినట్లు గుర్తించారు. వాటిని వెలికితీయగా ఆరు మృతదేహాలు లభ్యమయ్యాయి. గాయపడిన ఐదుగురిని రక్షించి చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శిథిలాలను తొలగించి, మార్గాన్ని పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. శ్రీనగర్ నుంచి లేహ్ వరకు ఉన్న ఈ 434 కిలోమీటర్ల పొడవైన రహదారి వ్యూహాత్మకంగా చాలా కీలకమైనది. సుమారు 11,575 అడుగుల ఎత్తులో ఉండే జోజిలా పాస్ మీదుగా ఇది వెళుతుంది. ఈ మార్గంలో తరచూ హిమపాతాలు సంభవిస్తుండటంతో, ఏడాది పొడవునా సురక్షిత ప్రయాణం కోసం జోజిలా పాస్ కింద భారీ సొరంగం నిర్మాణంలో ఉంది. ఈ టన్నెల్ పూర్తయితే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని, పర్యాటక రంగంతో పాటు సైనిక దళాల తరలింపునకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు.

# ఎమ్మెల్యే పేరుతో అక్రమ నిర్మాణం

-రెండుసార్లు సీజ్ చేసిన సీజ్ తొలగించి నిర్మాణ పనులు
-ప్రభుత్వ సీజ్ ని తొలగిస్తే అధికారులు కేసులు పెట్టరా.?
-అధికారుల అవినీతితో ప్రభుత్వ నియమనిబంధనలపై ప్రజలకు విశ్వాసం పోతుంది
-పోలీసులకు ఫిర్యాదు చేశాం, కేసులు పెట్టలేదంటూ పోలీసులపై నెట్టుతున్న వైనం
ఎమ్మెల్యే బిఎల్అర్ పేరు చెప్పి కొత్త నాటకం ప్రారంభించిన నిర్మాణదారుడు, అధికారులు
ఎమ్మెల్యే పేరును ఉపయోగించడంలో స్థానిక బీఆర్ఎస్ నేతల కీలక పాత్ర




కాప్రా (ప్రశ్న న్యూస్) కాప్రా సర్కిల్లో అక్రమ నిర్మాణాల ముసుగులో అధికారుల అవినీతి మళ్లీ బయటపడుతోంది. "ఎమ్మెల్యే పేరుతో నిర్మాణం" అనే కొత్త నాటకం ఆడుతూ, అసలు నిందితులను కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రమేయం లేకపోయినా, ఆయన పేరును అక్రమ నిర్మాణదారుడు ముందుకు తెచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. ఎమ్మెల్యే పేరు చెప్పి స్థానిక బీఆర్ఎస్ నేతల కనుసైగల్లోనే ఈ అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "ఎమ్మెల్యే మద్దతు ఉంది" అనే పేరుతో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణం చేయడంతో పాటు పార్కింగ్ కోసం వదరాల్సిన స్టిల్ట్ లో షెటర్లు నిర్మించి వ్యాపారం కోసం టూ లెట్ బోర్డు సైతం ఏర్పాటు చేయడం అదనపు అంతస్తులకు అనుమతులు లేకుండా భవనాలు కట్టేస్తూ, తర్వాత అధికారులతో సెటిల్మెంట్లు చేసుకునే దందా నడుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### కాగితాలకే జిహెచ్ఎంసి నిబంధనలా.?

జిహెచ్ఎంసి నియమ నిబంధనలు కాప్రా సర్కిల్ పరిధిలో కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా.? అనే సందేహం వ్యక్తమవుతోంది. ఇక్కడ ముఖ్యంగా చర్చనీయాంశమైన విషయం ఏమిటంటే ఒక భవనాన్ని రెండు సార్లు సీజ్ చేసినప్పటికీ, అదే భవనం తిరిగి ప్రారంభానికి సిద్ధమవడం. ఇది సాధారణ విషయం కాదు. ప్రభుత్వ అధికారులు సీజ్ చేసిన భవనంలో మళ్లీ పనులు ఎలా మొదలయ్యాయి.? ఎవరి అనుమతితో.? ఒక్కసారి సీజ్ ను తొలగిస్తేనే కేసులు పెట్టి జైలుకు పంపాలి. మరి రెండుసార్లు సీజ్ చేయడం అంటే అధికారులు అసలు డ్యూటీ చేస్తున్నారా.? రెండవసారి సీజ్ చేసిన అక్రమ నిర్మాణదారుడు దానిని తొలగించి నిర్మాణ పనులు పూర్తి చేయడం అంటే కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి ఎంత తీవ్రస్థాయిలో ఉందో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తాకు, మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కే తెలియాలి. వాళ్ల పరిధిలో ఇంత అవినీతి జరుగుతుంటే ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదంటే ఉన్నత అధికారులకు కూడా వాటాలు ఉన్నాయా.? అన్న అనుమానాలు స్థానికుల నుండి వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి పై ఉంది. కానీ ఇప్పటివరకు ఎవరూ స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.ప్రజలు ఆశ్చర్యం వ్యక్తంచేయడం ఏమిటంటే "సీజ్" అనేది కేవలం నాటకం మాత్రమే. కొంత కాలం తర్వాత అదే భవనం మళ్లీ పనులు ప్రారంభమవుతుంటే కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి ఎంత లోతుగా ఉందో అర్థమవుతోంది. ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున నష్టం కలిగిస్తున్న ఈ అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ, కాప్రా సర్కిల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి మరింత పెరుగుతున్నాయి.ఇంకా ఆందోళన కలిగిస్తున్న అంశం జోనల్ సిపి కృష్ణమోహన్, సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్ పేర్లతో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే గుసగుసలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో నిజమెంత అనేది ఉన్నత అధికారులు స్పష్టంగా చెప్పాలి. లేదంటే ప్రజల్లో మున్సిపల్ చట్టాలపై నమ్మకం కోల్పోయే పరిస్థితి వస్తుంది. అవినీతి అక్రమాలలో అధికారుల పేర్లు వినిపించడం అనేది చిన్న విషయం కాదు, ఇది మున్సిపల్ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది.



### పోలీసుల పాత్ర పై అనుమానాల ప్రచారం..



చర్లపల్లి పోలీస్ స్టేషన్ పోలీసుల పాత్ర కూడా ప్రశ్నార్థకంగా మారింది. అక్రమ నిర్మాణదారుడిపై కేసు నమోదు చేయాలని కాప్రా సర్కిల్ అధికారులు ఫిర్యాదు చేసినప్పటికీ, చర్లపల్లి పోలీసులు కేసు నమోదు చేయలేదంటూ ప్రచారం జరుగుతోంది. ఇది నిజమైతే చట్టం ముందు అందరూ సమానమన్న న్యాయం ఎక్కడుంది.? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఒకవైపు అధికారులు "ఫిర్యాదు చేశాం" అంటుంటే మరోవైపు పోలీసులు "కేసు లేదు" అంటున్నారు. ఈ విభేదాల వెనుక అసలు నిజం ఏమిటి.? అయితే టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసుల పేరు చెప్పి ఎందుకు కాలక్షేపం చేస్తున్నారో వాళ్లకే తెలియాలి.కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులపై ఇప్పటికే అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన వారు, వాటిని ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం లో ప్రజా పాలన అంటే ఇదేనా.? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ శాఖ అధికారులే నియమనిబంధనలు పట్టించుకోకపోతే, సాధారణ ప్రజలు ఎలా పాటిస్తారు.?ఈ పరిస్థితుల్లో ఉప్పల్ జోనల్ కమిషనర్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. కాప్రా సర్కిల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టి బాధ్యులైన సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పేరును ఉపయోగించి జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణ ప్రచారాన్ని కూడా ఖండిస్తూ, అసలు నిజాలను బయటపెట్టాలి. లేకపోతే ప్రజల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిపై, జిహెచ్ఎంసి కమిషనర్ పై నమ్మకం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది.మొత్తానికి, కాప్రా సర్కిల్లో జరుగుతున్న ఈ ఘటనలు జిహెచ్ఎంసి వ్యవస్థలో ఉన్న లోపాలను బయట పెడుతున్నాయి. అవినీతి, నిర్లక్ష్యం, రాజకీయ ముసుగులో జరుగుతున్న అక్రమాలు ఇవన్నీ కలిపి ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నత అధికారులు మేల్కొని, చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారా.? లేక ఇదే పరిస్థితి కొనసాగుతుందా.? అన్నది వేచి చూడాల్సిందే.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588